# సాక్షి
## మానవ హక్కుల నిఘా

NEWSLETTER - 16 BI MONTHLY FOR PRIVATE CIRCULATION ONLY DEC - JAN : 2008



# బడ్జెట్‌లో ప్రజల భాగస్వామ్యం?

...✍ - వి. నందగోపాల్

ప్రజాస్వామ్య దేశంగా చెప్పకొంటున్న మనదేశంలో రాష్ట్రకేంద్ర ప్రభుత్వాలు ఏ మేరకు బడ్జెట్ రూపకల్పనలో ప్రజాస్వామ్య విలువలు పాటిస్తున్నాయి? ప్రజలచేత ప్రజల కొరకు ఎన్నుకోబడి ప్రజల యొక్క ప్రభుత్వాలుగా చలామణి అవుతున్న ఈ ప్రభుత్వాలు బడ్జెట్ తయారీలలోనూ ఇదే సూత్రాన్ని వుపయోగించాలి కదా! అయితే ఈనాటి వరకూ ఇది సగటు మనిషికి కూడా చేరుకోలేదు. ఇక అట్టడుగున వున్న దళిత, గిరిజన అణచబడిన వర్గాలకు ఎప్పడు చేరుకుంటుంది. అయితే ప్రభుత్వాలు ఇలా ఎంత కాలమూ కొనసాగలేవు. వేగం పుంజుకుంటున్న ప్రజాచైతన్యం నేడు ప్రతి కోటాలోను తమ వాటా ఏమిటో చెప్పమంటోంది. సాంఘిక న్యాయం సమానత్వం మాట్లాడే ప్రభుత్వాలు తమ మనుగడ మరింత కాలం కొనసాగించాలనుకొంటే సమాజంలోని ఆయా వర్గాల వేదన రోధనలను అర్థం చేసికోవాలి. బడ్జెట్‌లో అందుకు తగిన కేటాయింపులు చేయాలి. చేసిన కేటాయింపులు నిర్ణయించిన సమయం ప్రకారం సరైన విధంగా ఖర్చు చేయాలి. ప్రతిస్థాయి లోనూ పారదర్శకత, జవాబుదారీ తనం ప్రాథమిక విలువలుగా ఈ ప్రక్రియ జరగాలి. బడ్జెట్‌లో అట్టడుగున వున్న జనసమూహాలు ఎదుర్కొంటున్న మౌళిక సమస్యలను అధిగమించి వారి అభివృద్ధికి దోహదపడే విధంగా వుంటే సర్వదా హర్ష దాయకంగా వుంటుంది కాని, కేవలం ఓట్లు గుంజుకొనే వుద్దేశ్యంతో ప్రలోభ పెట్టే బడ్జెట్ అభివృద్ధి క్రమాన్ని తిరుగుబాటు పట్టిస్తుందన్న విషయం నాయకులు మరవకూడదు. నేషనల్ శాంపిల్ సర్వే 2004 - 05 ప్రకారం గ్రామీణ ప్రాంతాలలో దళితులు నెలకు చేస్తున్న కుటుంబ వ్యయం రూ. 474.72 మాత్రమే అదే ఓబిసిలు రూ. 556.72 ఇతరులు రూ. 685.31 వీరి సర్వే ప్రకారమే ఒక వ్యక్తికి రోజుకు అవసరమైన 2400 కేలరీల ఆహారం కంటే తక్కువ తినే గ్రామీణ జనాభా 1993-94 లో 74.5% వుండగా 2004-05 నాటికి 87శాతంగా వుంది. మన రాష్ట్రంలో వున్న 1.60 లక్షల వికలాంగులైన బాలబాలికలలో 44,800 మంది. బడి ముఖమే చూడలేదు. ప్రతి 40000 వికలాంగులైన పిల్లల్లో 9శాతం వారికి మాత్రమే సంక్షేమ సహాయలందుతున్నాయి.

ఎస్.సిల్లో అర్థాంతరంగా చదువులు మానేస్తున్న విద్యార్థుల శాతం 1 నుండి 5 తరగతులలో 27.66.%, 1-7 తరగతుల్లో 48.1, % - 9 తరగతులలో 69.82%గా వుంది. ఇదే ఎస్.టిలలో 51.67% , 80.19% మరియు 81.96% శాతంగా ఉంది. పెరుగుతున్న రాష్ట్ర ఆదాయాల్లో గాని, అభివృద్ధి సూచికల్లో గాని వీరి స్థానం ఎక్కడ?

2008 -09 సం॥ సంబంధించి మన రాష్ట్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి 16న ప్రవేశపెట్టనున్నారు. దాదాపు 42 వేల కోట్లకు పైగా వుండబోతున్న ఈ బడ్జెట్‌లో దళితులు, గిరిజనులు, బిసిలు, మైనారిటీలు, మహిళలు, పిల్లలు, వికలాంగులు, వ్యవసాయ కూలీలు, చేతి వృత్తిపనివారు. సన్న, చిన్న కమతాల రైతులు, నిరుద్యోగులైన గ్రామీణ యువకులు ఎదుర్కొంటున్న అనేకమైన సమస్యలకు, వారి అభివృద్ధికి కేటాయించిన వాటా గణనీయంగా వుంటుందని ఆశిద్దాం. •

## దళిత్ కాల్ లైన్

### నెంబర్ : 040 - 65440969

నేటి సమాజంలో కులవ్యవస్థ వేళ్ళు పాతుకొని పోయిన సందర్భంలో దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల ప్రజలు అనేక హింసలకు గురౌతున్నారు. కుల అకృత్యాలకు సాక్షులుగా ప్రత్యేకించి దళితులు, గిరిజనులు అందులోనూ స్త్రీలు మిగులుతున్నారు. అలాంటి ఘోరమైన పరిస్థితి హైటెక్ నగరమైన హైదరాబాద్‌లోని హయత్‌నగర్ నుండి ఒంగోలు వెంగముక్కల పాలెం వరకు అనేక ఘటనలు మనముందుకు వస్తున్నాయి. రాష్ట్రమంతటా ఇలాంటి పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో సాక్షి మానవహక్కుల నిఘా తన బాధ్యతల్ని తాను నిర్వర్తించుకుంటూ ముందుకు వెళుతుంది. ఆ క్రమంలో ఉన్న సమాచార వ్యవస్థని మరింత విస్తృతం చేసుకోవాల్సిన అవసరం వుంది.

కావున గ్రామాల్లో వివిధ ఉద్యమాల్లో ప్రజోపయోగ కార్యక్రమాల్లో పాల్గొంటున్న సామాజిక కార్యకర్తలు ఆయా గ్రామాల్లో జరిగిన “**రేప్, మర్డర్, సాంఘిక బహిష్కరణ, సామూహిక దాడులు, ఆస్తుల విధ్వంసం, లాకప్‌మరణాలు** మొదలైన వాటి వివరాలను ఫోన్ నెంబర్ 040-65440969కు తెలియజేయవలసిందిగా కోరడమైనది.

ఇట్లు

**సాక్షి మానవహక్కుల నిఘా**

# దళితులు - 2008 - 09 రాష్ట్ర బడ్జెట్ ఎలా వుండాలి?

...✍ - సారంపల్లి

దళితుల సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు రూపొందించి అభివృద్ధి పథంలోకి తీసుకొని వెళుతున్నామని నిరంతరం ఘోషిస్తున్నాయి. స్వపరిపాలన వచ్చి ఆరు దశాబ్దాలు పూర్తై 7వ దశాబ్దంలో అడుగుపెట్టినప్పటికీ, దళితులు స్థితిగతులు "ఎక్కడ వేసిన గొంగడి అక్కడనే" అన్న చందంగా ఉన్నది. వీరి సంక్షేమం కొరకు వేల కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయిస్తున్నామని శాసనసభల్లో ప్రకటిస్తున్నారు. కాని కేటాయించిన బడ్జెట్‌ను విడుదలచేయడం లేదు. ఆ కేటాయింపులు కూడా కేంద్ర ప్రణాళిక బోర్డు ఆదేశాలకు అనుగుణంగా లేవు. ప్రణాళిక బోర్డు దళితుల సంక్షేమం పట్ల శ్రద్ధ చూపుతున్నట్లు గోచరించదు.

ప్రతి సందర్భంలో పాలక ప్రభుత్వాలు దళితులకు "పెద్దపీట" వేస్తున్నామని ప్రచారం చేయడం అలవాటుగా మారింది. పెద్దపీట కాదు, న్యాయంగా వారికి రావాల్సిన నిధులు కేటాయించి, విడుదల చేస్తే అదే పెద్ద పీట అవుతుంది.

నేడు దళితులు ఆర్థికంగా, సాంఘికంగా మరింత వెనుకబడిపోతున్నారు. 2001 జనాభా లెక్కల ప్రకారం 1.24 కోట్ల మంది దళితులు ఉన్నారు. గత 7 సంవత్సరాలలో వీరి జనాభా మరో 13% పెరిగింది. మొత్తం జనాభాలో 16.20 శాతంగా ఉన్నారు. పట్టణాల్లో 23 లక్షల మంది నివసిస్తుండగా గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికి 1.03 కోట్ల మంది నివసిస్తున్నారు. ఏ వనరులు లేని గ్రామీణ ప్రాంతాల్లో విద్యా, వైద్యం అందుబాట్లో లేక ఇబ్బందులు పడుతున్నారు. పౌష్టిక ఆహారం కొరత వల్ల అనేకమంది చిన్నతనంలోనే మరణిస్తున్నారు. గర్భిణీస్త్రీల పరిస్థితి మరింత దయనీయంగా ఉన్నది. దళితవాడల్లో రోడ్డు సౌకర్యం గాని, మంచినీటి సౌకర్యం కాని అందుబాట్లో లేవు. రిజర్వేషన్ల ఫలితంగా దళితులు ప్రజా ప్రతినిధులు ఎంపికైన చోట కూడా దళితేతరుల పెత్తనం క్రిందనే ఉండటం వలన, దళితులకు కేటాయించిన నిధులు దారి మళ్ళుతున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా సంక్షేమ పథకాలకు దూరంగా నెట్టివేయడుతున్నారు. ప్రధానంగా వీరు కూడు, గూడు, విద్యా, ఆరోగ్య రంగాలకు అతిదూరంగా నివసిస్తున్నారు.

1982లో ప్రారంభించిన సాగుభూమి కొనుగోలు పథకం భూముల ధరలు పెరగడంతో అటెకెక్కింది. దళితులకు పంపిణీ చేసిన ప్రభుత్వ భూములు గ్రామీణ భూస్వాములు పెద్ద మోతాదులో ఆక్రమించుకున్నారు. చట్టాలు దళితుల పక్షాన ఉన్నా, అధికారుల భూస్వాముల పక్షాన ఉండి చట్టాలు అమలు కాకుండా అడ్డుకుంటున్న ఘటనలు కోకొల్లలు. భూములు పంపిణీ చేసిన చోట చదును చేసుకోవడానికి ఇందిర ప్రభ పేరుతో కేటాయించిన రూ. 500 కోట్ల బడ్జెట్ రెండవ సంవత్సరం గడుస్తున్నా వినియోగంలోకి రాలేదు.

గూడు విషయానికి వస్తే ఇండ్లు లేని వారి సంఖ్య వేలల్లో ఉన్నారు. గ్రామానికి దూరంగా ఏ వనరులు లేని చోట అగ్గిపెట్టె లాంటి ఇండ్లను నిర్మించి జీవించమంటున్నారు. ఆ ఇండ్లల్లో ఇద్దరికి మించి ఉండలేరు. కొత్తగా వివాహమైన దంపతులు పెద్దలతో కలిసి జీవించవలసిన దుస్థితి నేటికీ కొనసాగుతున్నది. రాష్ట్రంలో లక్షలాది ఎకరాల భూములున్నా వీరికి మాత్రము ఇంటికి ఒక గుంట (121 చ.గ) భూమి ఇవ్వలేకపోతున్నారు. ఏటా బడ్జెట్‌లో ఇండ్ల స్థలాల కొనుగోలుకు కేటాయింపులు చూపుతున్నారు.

దళితుల విద్యా సౌకర్యాలు పరిశీలిస్తే నేటికి 53.52 శాతం అక్షరాస్యులున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. మహిళల్లో 43.35 శాతం కాగా, పురుషుల్లో 63.51 శాతంగా ఉన్నారు. ఈ అక్షరాస్యత గణాంకాలు పాఠశాలకు వెళ్ళి పేర్లు నమోదు చేసుకున్న వారితో లెక్కవేసి తీసినవే. 2004-05 ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్స్ రిపోర్టు ప్రకారం 2.356 హాస్టళ్ళల్లో 2,62,398 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. కొనుగోలు శక్తిలేక కూటికే ఇబ్బందులు పడుతున్నా ఈ కుటుంబాల వారు ఫీజులు చెల్లించి విద్యాభ్యాసం చేయగలరా?

ఆరోగ్య సౌకర్యాల గురించి గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సౌకర్యం కల్పించామని చెప్పడమే తప్ప, ఎక్కడ వైద్య సౌకర్య అందుబాట్లో లేదు. సంస్కరణల పుణ్యమా అని కార్పొరేట్ హాస్పిటల్స్ వెలిసాయి. అందులోకి అడుగుపెట్టే ధైర్యం దళితులు చేయగలరా?

ఈ రంగాలకు సంబంధించి పెద్దమొత్తాల్లో బడ్జెట్ నిధులు కేటాయిస్తున్నామని జరుగుతున్న ప్రచారం హోరెత్తిపోతున్నది. వాస్తవాలు ఈ విధంగా ఉన్నాయి.

| సం॥ | ఖర్చు చేసిన బడ్జెట్ (కోట్లల్లో) |
|---|---|
| 1997-98 | 308.08 |
| 1998-99 | 422.95 |
| 1999-00 | 349.73 |
| 2000-01 | 475.97 |
| 2001-02 | 573.93 |
| 2002-03 | 531.22 |
| 2003-04 | 829.04 |
| 2004-05 | 744.55 |
| 2005-06 | 612.58 |
| 2006-07 | 1527.14 (రివైజ్డ్) |
| 2007-08 | 1699.98 (ఎస్టిమేట్స్) |

పై బడ్జెట్‌లు ఏనాడు మొత్తం బడ్జెట్లలో 4.5 శాతానికి మించిలేవు. 3శాతం నుండి 4.34 మధ్యనే వ్యయం పెరిగింది. జనాభా రీత్యా 15 శాతంగా ఉన్న వీరికి మూడవ వంతు శాతానికి

ఏలోపుమాత్రమే కేటాయింపులు జరిగాయి. దళితులు అభివృద్ధిలోకి రావడానికి ఈ బడ్జెట్‌లు ఏ విధంగాను దోహదం చేయవు.

2007-08 బడ్జెట్‌లోని ప్రణాళిక వ్యయం రూ. 1144.18 కోట్లు మాత్రమే. ఇందులో రూ. 365.03 కోట్లు కేంద్ర పథకాలు కాగా, 779.15 కోట్లు రాష్ట్ర పథకానివి. కేంద్రం స్పెషల్ కాంపోనెంట్ క్రింద 90 కోట్లు, 179 కోట్లు రెసిడెన్షియల్ పాఠశాలలకు 14 కోట్లు ఇస్తున్నది. రాష్ట్రం ప్రధానంగా ఇండ్ల స్థలాల అభివృద్ధికి 400 కోట్లు, ఇండ్ల స్థలాల ఇందిరమ్మ పథకానికి రూ. 100 కోట్లు, పోస్టు, పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్స్‌కు రూ. 150కోట్లు కేటాయించింది. భవననిర్మాణాలకు రూ. 10కోట్లు కేటాయించారు.

కులాంతర వివాహాలకు రూ. 60లక్షలు, అఘాయిత్యాలకు గురైన వారికి రూ. 76లక్షలు, వ్యవసాయ భూమి కొనుగోలుకు రూ. 10లక్షలు, బుక్ బ్యాంక్‌కు రూ. 2లక్షలు, స్పెషల్ క్రిమినల్ కోర్టుల సహకారానికి రూ. 1.75 లక్షలు, అంబేద్కర్ విగ్రహాలకు రూ. 20 లక్షలు కేటాయించడాన్ని గమనిస్తే ప్రభుత్వానికి దళితుల సంక్షేమంపై ఎంత ప్రేమ ఉన్నదో విదితమౌతుంది.

**నిబంధనలు ఏమి చెబుతున్నాయి?**

**దళితుల సంక్షేమ పథకాలకు బడ్జెట్ కేటాయింపుల్లో గాని, ఏ ఇతర కేటాయింపుల్లో గాని, చివరకు బ్యాంక్ రుణాల్లో గాని తప్పని సరిగా 15శాతం కేటాయించాలని నిబంధనలు చెబుతున్నాయి. ప్రస్తుతం దీనిని 16.2 శాతానికి పెంచారు. ఆ విధంగా రాష్ట్ర ప్రణాళిక బడ్జెట్‌లో కేటాయింపులు జరగాలి. కాని 5శాతం మించడం లేదు. బ్యాంక్‌లు రుణాలు ఇచ్చే సందర్భంగా అర్హత కలిగిన దళితులు లేరని చెబుతున్నాయి. ఈ ఆరోపణ పూర్తి అవాస్తమని సర్వేల ద్వారా తెలుస్తున్నది.** గతంలో కేటాయించిన ప్రణాళిక నిధులలో దారి మళ్ళిన మొత్తాలు రూ. 20,000 కోట్లు ఉంటుందని సర్వేలు తెలుపుతున్నాయి. ఈ నిధుల మళ్లింపును ఆపడానికి, కేటాయింపులను దళితులకే వ్యయం చేయడానికి నోడల్ ఏజెన్సీని ఏర్పాటుచేయాలని ఆందోళనలు సాగాయి. ఫలితంగా నోడల్ ఏజెన్సీ ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకారం కూడా తెలిపింది. అయినా అమలు జరుగుతుందన్న నమ్మకం అంతగా కలగడం లేదు.

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భూ పంపిణీ కార్యక్రమం చేపట్టింది. గతంలో మూడు దశలుగా 4.36 లక్షల ఎకరాలు పంపిణీ చేసింది. నాల్గవ విడతగా 1.15లక్షల ఎకరాల పంపిణీ కార్యక్రమం 2008 జనవరి 19 నుండి 25 వరకు కొనసాగుతున్నది. ఈ పంపిణీలో దళితుల వాటా ఎంత? నేటికి రాష్ట్రంలో 40 లక్షల ఎకరాల భూమి పంపిణీకి అర్హమైనదిగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆ భూములను పంచడానికి ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడం లేదు. భూ సంస్కరణలు సక్రమంగా అమలు జరిగిన పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాల్లో దళితుల వద్ద సాగుభూములు ఉన్నాయి. 70 శాతం సాగు భూమి సన్న, చిన్నకారు రైతుల ఆధీనంలో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో 86శాతం ఉన్న సన్న, చిన్నకారు రైతుల వద్ద 40శాతం సాగుభూమి మాత్రమే ఉంది. ఇంత తేడా ఉన్నా, రాష్ట్రంలో భూ సంస్కరణలు సక్రమంగా అమలు జరిపామని ప్రకటించుకోవడం ఆత్మవంచనే అవుతుంది.

**2008-09 బడ్జెట్ ఎలా వుండాలి?**

రానున్న వార్షిక బడ్జెట్‌లోనైనా దళితుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రధానంగా వారు ఎదుర్కొంటున్నా సమస్యలకు బడ్జెట్ పరిష్కారం చూపాలి. బడ్జెట్ కేటాయింపులే కాదు నిధుల విడుదల కూడా జరగాలి. నేటి బడ్జెట్‌ల అమలులో పాలకుల నైతికత లోపిస్తుంది. ఒకసారి కేటాయింపులు జరిగాక వాటి విడుదలకు ఎలాంటి ఆటంకాలకు కల్పించరాదు. నిధుల కొరత ఏర్పడినప్పుడు అవసరమైతే ఇతర రంగాల నుండి సంక్షేమ రంగాలకు మళ్ళింపులు జరగాలి. కాని అందుకు భిన్నంగా ప్రభుత్వాలు సంక్షేమ పథకాలకే కోతలు పెడుతున్నాయి.

సాగుకు ప్రభుత్వ భూమి పంపిణీ, ప్రభుత్వ భూమి లేనిచోట ప్రైవేట్ భూములను కొనుగోలు చేసి దళితులకు పంచాలి. ఈ భూముల నాణ్యత సాగుకు అనుగుణంగా ఉండాలి. దీనికి కావలసిన నిధులను కేటాయించాలి.

ఇండ్లు పూర్తిగా ప్రభుత్వం రాయితీపైననే నిర్మించాలి. నివాసయోగ్యం ఉండే విధంగా నిర్మించాలి. అన్ని వసతులు కల్పించాలి.

విద్యా సౌకర్యాలు కల్పించాలి. డిగ్రీ స్థాయివరకు ఉచితవిద్యా బోధన ఉండాలి. టెక్నికల్ విద్య, మొదలగు వాటికి సంబంధించిన ప్రవేశపరీక్షలకు ఉచిత విద్యాబోధన జరపాలి. ఆశ్రమ పాఠశాలల నిర్మాణం చేపట్టాలి. బాలబాలికలకున్న హాస్టల్స్‌లో అన్ని సౌకర్యాలు కల్పించాలి. హాస్టల్స్‌లో ఉన్నవారికి హెల్త్‌కార్డులను సరఫరా చేసి నిరంతరం ఆరోగ్య పరీక్షలు జరపాలి.

కులాంతర వివాహాలు చేసుకున్న వారికి, అఘాయిత్యాలకు గురైన వారికి, అక్రమంగా కేసులకు గురైన వారికి పూర్తి ఆర్థిక సహకారం అందించడానికి ప్రత్యేకమైన నిధిని ఏర్పాటు చేయాలి. కమ్యూనిటీ భవనాల నిర్మాణాలకు, దళిత వాడల్లో రహదారులు, వీధి దీపాల ఏర్పాటుకు తగినన్ని నిధులు కేటాయించాలి. రెండు బల్బులు వినియోగించే వారికి ఉచిత విద్యుత్ సరఫరా చేయాలి. గ్రామీణ దళితుల రుణాలనుపూర్తిగా రద్దుచేయాలి.

దళిత మహిళల సంరక్షణకు ప్రత్యేక పథకాలను రూపొందించాలి. సౌకర్యం, మహిళల, ప్రసూతి, చిన్నపిల్లల ఆరోగ్య వసతి సౌకర్యాలను ప్రభుత్వం కల్పించాలి. దళిత వాడల్లో మహిళలకు, యువకులకు అందరికి వయోజన విద్యాబోధన జరపాలి. దళితులతో కమిటీలు వేసి నిధులు సక్రమంగా వినియోగం అవుతున్నదీ లేనిది పరిశీలించడానికి సామాజిక ఆడిట్ నిర్వహించాలి. మొత్తం ప్రణాళిక బడ్జెట్‌లో 16.2 శాతాన్ని దళితులకు కేటాయించాలి. ఆ విధంగా 2008-09 బడ్జెట్‌లో దళితుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

●

# రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ నిర్మాణం

...✍ ఎస్.ఎస్. కార్నిక్
సెంటర్ ఫర్ బడ్జెట్ స్టడీస్ ముంబాయి

నేడు దేశంలో ప్రభుత్వ పాలనలో అనేక సందర్భాల్లో బడ్జెట్ సంబంధిత చర్చలు జరుగుతున్నాయి. ఆ నేపథ్యంలో త్వరలో రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ కూడా మన ముందుకి రానుంది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ రూపకల్పన ఎలా జరుగుతుంది? ఆ చర్చలు అసెంబ్లీలో ఎలా జరుగుతాయి? ఆ బడ్జెట్‌లో దళితులెక్కడ ఉన్నారు? వారి కేటాయింపులు వాటి ఆచరణ ఎలా జరుగుతుంది? ఈ విషయాలు మానవ హక్కుల కార్యకర్తలమైన మన అందరికీ తెలుసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. 2005 జనవరి 6 నుండి 8 వరకు సాక్షి మరియు సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్‌ల సంయుక్త నిర్వహణలో హైదరాబాద్‌లో బడ్జెట్ విశ్లేషణ మరియు పర్యవేక్షణల శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్.ఎస్. కార్నిక్ గారి వ్యాసానికి తిమ్మారెడ్డి గారు చేసిన అనువాదంలోని కొంత సమాచారాన్ని కొన్ని వ్యాసాల్ని మీ ముందుకి తెస్తున్నాం. మీ మీ అభిప్రాయాల్ని తెలియజేయగలరని మనవి.

**రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌ను రూపొందించడంలోని ముఖ్యాంశాలు:**

ఒక సమాజంలోని ప్రతి వ్యక్తి లేక కొంత మంది వ్యక్తుల సమూహం (ఉదా ॥ కుటుంబం) కాక కొన్ని నిర్ణీత ఆశయాల కొరకై ఏర్పడిన సంస్థలు, (ప్రైవేటు లేక పబ్లిక్) తమ ఆశయాలు సాధించే క్రమంలో డబ్బు ఖర్చు చేయవలసి వస్తుంది. ఈసంస్థలు ఖర్చు భరించడానికి వాటి పరిణామాన్ని బట్టి, లక్షణాలను బట్టి నిర్వహించే కార్యక్రమాలనుబట్టి ఒకటి కాని, అంతకంటే ఎక్కువకాని ఆదాయ వనరులు కలిగి వుంటాయి. ఒక వ్యక్తియైనా, సంస్థయైనా సక్రమైన ప్రుడెంట్ నిర్వహణలో భాగంగా తమ ఖర్చులను తమకు లభ్యమయ్యే వనరులకు లోబడి వుండేటట్టు జాగ్రత్త వహిస్తారు. అదే సమయంలో, ఆయా పరిస్థితులకు అనుగుణంగా సమంజసమైన (ఆప్టిమమ్) ఖర్చును భరించడానికి అవసరమైన డబ్బు అందుబాటులో వుండేటట్టు ఆయా నిర్వాహకులు అదనపు వనరులను సమీకరించడంలో నిమగ్నమై వుంటారు. ఒక నిర్ణీత కాలానికి సంబంధించిన ఆదాయ - వ్యయాలు సమతూకంగా ఉండేటట్టు చూడటానికి ఆ కాలానికి చెందిన ఆదాయం మరియు వ్యయాలకై ఒక ముందస్తు ప్రణాళికను తయారు చేసుకోవడం చాలా అవసరం. ఈ నిర్ణీత కాలాన్ని మామూలుగా ఒక సంవత్సరంగా పరిగణించవచ్చు. ఈ విధంగా ప్రతి సంవత్సరం ప్రారంభంలోనే తయారు చేసుకునే ముందస్తు ప్రణాళికను "సాలుసరి బడ్జెట్" అని అంటారు.

వ్యక్తులు లేక కుటుంబాల విషయంలో, ప్రణాళికల రూపకల్పనలో ఒకఖచ్చితమైన క్రమాన్ని పాటించవలసిన అవసరం లేకపోవచ్చు. ముఖ్యంగా, ఉన్న ఆదాయ వనరులు ఖర్చులన్నీ తీర్చడంతో పాటు రాబోయే గడ్డురోజులకై (రేయిని డే) కొంత ఆదా చేసుకోవడానికి అనువుగా వున్నప్పుడు ముందస్తు ప్రణాళికను తయారు చేయడంలో ఎక్కువగా శ్రమ పెట్టవలసిన అవసరం లేదు. నిజానికి చాలా సందర్భాలలో ముందస్తు ప్రణాళికను ప్రక్కన పెట్టారు. ఏది ఏమైనా, ఒక వ్యక్తికిగాని, కొందరు వ్యక్తుల సమూహానికి గాని, లేక ఒక సంస్థకు గాని సంబంధించిన బడ్జెట్‌ను రూపొందించడంలో ఒక మూల సూత్రాన్ని గుర్తుంచుకోవాలి. ఇది ఏమిటంటే, ఖర్చులను ఉన్న ఆదాయ వనరులకు లోబడి వుండేటట్టు చూసుకోవాలి. అంతకు ముందే నిర్ణయించుకున్న ఖర్చులను భరించడానికై సంవత్సరకాలంలో తగినన్ని వనరులను సమీకరించుకోవాలి.

**రాష్ట్ర బడ్జెట్ :**

పైన చర్చించిన ముఖ్య సూత్రం ప్రభుత్వ (కేంద్ర మరియు రాష్ట్ర) బడ్జెట్ రూపకల్పనకు కూడ వర్తిస్తుంది.

ఈ పత్రం రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌ను రూపొందించడంలోని ముఖ్యాంశాలను ముందుంచుతుంది.

బడ్జెట్‌ను రూపొందించే కార్యక్రమం చాలా ఖచ్చితమైన క్రమాన్ని కలిగి వుంటుంది. బడ్జెట్ రూపకల్పన కొన్ని నియమాలను అనుసరించి జరుగుతుంది. ఈ నియమాలను రాజ్యాంగంలోని వివిధ ఆర్టికల్స్ పరిధిలోనే రూపొందిస్తారు.

సాలుసరి బడ్జెట్‌ను ప్రతిపాదించడం రాష్ట్ర ప్రభుత్వాల యొక్క చట్టబద్ధమైన విధి రాజ్యాంగంలోని 202 ఆర్టికల్‌ను అనుసరించి ఆర్థిక సంవత్సరానికి (ఏప్రిల్ 1వ తేది నుండి మార్చి 31వ తేదీ వరకు) సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వం యొక్క ఆదాయ - వ్యయాల అంచనాలతో కూడిన నివేదికను రాష్ట్ర గవర్నరు రాష్ట్ర శాసన సభ ముందు వుంచాలి. ఈ నివేదికను వార్షిక నివేదిక అంటారు. ఇందులో

1. ప్రజా ప్రయోజనాల కొరకై ఆర్థిక సంవత్సరంలో ఖర్చు పెట్టవలసిన డబ్బును సూచించే నివేదిక
2. ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం సమీకరించే ఆదాయం మరియు రాబడులు
3. ప్రభుత్వము యొక్క ఆర్థిక స్థితిని తెలిపే నివేదికలు ఉంటాయి. ఆర్టికల్ 202తో పాటు రాజ్యాంగములోని 204, 266 మరియు 267 ఆర్టికల్స్ కూడా బడ్జెట్ రూపకల్పనకు సంబంధించినవి.

ఆర్టికల్ 266ను అనుసరించి ప్రభుత్వానికి వచ్చే అన్ని రాబడులు, ప్రభుత్వం తెచ్చిన అప్పులు, ప్రభుత్వం ఇచ్చిన అప్పులు తిరిగి చెల్లించడం ద్వారా అందిన ధనాన్ని రాష్ట్ర కన్సాలిడేటేడ్ ఫండ్‌కు జమ చేయాలి. ఈ ఖర్చులను రాజ్యాంగంలోని ఆర్టికల్ 204 ప్రకారం రాష్ట్ర శాసన సభ ఆమోదించిన అప్రాప్రియేషన్ యాక్ట్‌లో ప్రతిపాదించిన పద్ధతిని అనుసరించి చేయాలి. ఒకసారి శాసన సభ బడ్జెట్‌ను ఆమోదించిన తరువాత ఆ సంవత్సరంలో చేసే ఖర్చులు ఆ బడ్జెట్ నిబంధనలకు లోబడే జరగాలి.

**బడ్జెట్ తయారీలో పాటించవలసిన సూత్రాలు :**

రాజ్యాంగం యొక్క చట్టబద్ధమైన నిబంధనలను అనుసరించి రూపొందించిన నియమాలను అనుసరించి బడ్జెట్‌ను రూపొందించడంలోని ముఖ్యాంశాలను క్రింది విధంగా పేర్కొనవచ్చు.

**1. సాలుసరి సూత్రం :**

రాబోయే సంవత్సరానికి సంబంధించి మాత్రమే బడ్జెట్‌ను ప్రతిపాదిస్తారు. శాసన సభ ఆమోదించిన గ్రాంట్లు ఒక ఆర్థిక సంవత్సరానికి, అంటే ఆ సంవత్సరపు మార్చి 31వతేదీ వరకు మాత్రమే

చెల్లుతాయి. ఈ గ్రాంట్లను వచ్చే సంవత్సరంలో వాడుకొనడానికి వీలుపడదు. దీనివలన ఆ సంవత్సరంలో నిరుపయోగంగా వున్న గ్రాంట్లు ఆ ఆర్థిక సంవత్సరాంతంలో మురిగి పోతాయి.

**2. సమగ్రతా సూత్రం :**

బడ్జెట్ సమగ్రంగా వుండాలి. ఇందులో రాబోయే సంవత్సరంలోని ఆదాయ - వ్యయాల అంచనాలను పొందుపరచాలి. ఇందులో అన్ని పథకాల మరియు కార్యక్రమాల పూర్తి సమాచారం వుండాలి. ఇందులో వివిధ రంగాల్లో కొనసాగుతున్న కార్యక్రమాల తీరుతెన్నులను వుంచాలి. ఇందులో ప్రభుత్వం యొక్క పూర్తి మరియు సరైన ఆర్థిక పరిస్థితి తెలియజేయాలి.

**3. స్పష్టతా సూత్రం :**

అన్ని ఆదాయ, వ్యయాలను స్పష్టంగా చూపించాలి. గుత్త కేటాయింపులను విడనాడాలి. దీని వలన వివిధ స్థాయిలలో లెక్కలను సరిగా తనిఖీ చేయడానికి వీలవుతుంది. దీనివలన యదార్థమైన ఖర్చులపై నిఘా వుంచడానికి వీలవుతుంది. బడ్జెట్‌కు సంబంధించి అజమాయిషీ చేయ సాధ్యమవుతుంది.

**4. స్థూల బడ్జెట్ సూత్రం :**

ఈ సూత్రానికి రాజ్యాంగములోని ఆర్టికల్ 204(3) ఆధారం. దీనిని అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగములో పొందుపరచిన నిబంధనల ప్రకారమే రాష్ట్ర కన్సాలిడేటెడ్ ఫండ్ నుండి డబ్బులను వాడుకోవాలి. దీనివలన ఖర్చు పద్దు క్రింద రాబడులను మరియు ఇతర వసూళ్ళను ఖర్చులో కుదింపుగా సర్దుబాటు చేసే పద్ధతిలో ప్రమేయం లేకుండా స్థూల ఖర్చును అధికారికం చేయడం తప్పనిసరి అవుతుంది. ఇది పెద్ద మొత్తంలో వచ్చే వసూళ్ళను తప్పుదారి పట్టించకుండ నివారించడానికి సహాయపడుతుంది.

**5. నిర్ణాయకసూత్రం**

ఆదాయ - వ్యయాలను ఎక్కువజేసి చూపడం కాని, తక్కువ చేసి చూపడం కాని బడ్జెట్ నిబంధనలను ఉల్లంఘించడం అవుతుంది. బడ్జెట్‌లోని అంశాలు సమగ్రంగా వుంటూ, అన్ని ఆదాయ - వ్యయాలను పొందుపరచడమే గాక అవి ఎంతవరకూ అవసరమో ఉండాలి కొంత ఎక్కువగాని, కొంత తక్కువగాని ఉండకూడదు. అయితే ఇది అనుకోని సంఘటనలు లేక పరిస్థితుల వలన ఉత్పన్నమయ్యే మార్పులకు చోటు కల్పించడానికి వీలుగా వుండాలి.

**6. కేటాయింపులను మళ్ళించకూడదనే సూత్రం:**

ఈ సూత్రము ప్రకారము వేరొక దగ్గర జరిగిన అధిక ఖర్చును భరించడానికి ఒక రంగానికి కేటాయించిన నిధులను మళ్ళించడం అంగీకరించబడదు.

**7. ప్రిన్సిపుల్స్ ఆఫ్ పిరియాడిక్ రివైవల్ అండ్ కరెక్టివ్ ఆక్షన్ :**

ఆదాయాలు, వ్యయాలు, రెండింటి విషయంలోను ఆచరణలో చోటు చేసుకుంటున్న యదార్ధ స్థితిని ఎస్టిమేటింగ్ ఆఫీసర్లు, కంట్రోలింగ్ ఆఫీసర్లు మరియు పరిపాలనా విభాగాలు జాగ్రత్తతో పరిశీలిస్తూ వుండాలి. ఎప్పటికప్పుడు సమీక్షలు జరుగుతూ వుండాలి. అంచనాలను క్రమబద్ధీకరిస్తూ వుండాలి. దీనికై సంబంధిత స్థాయిల నుండి ఉత్తర్వులను పొందాలి. పునఃపరిశీలించిన అంచనాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలి.

పైన పేర్కొన్న సూత్రాలలో మొదటి సూత్రాలు బడ్జెట్ రూపకల్పనకు వర్తిస్తాయి. చివరి రెండు సూత్రాలు బడ్జెట్ ఆచరణకు వర్తిస్తాయి.

**బడ్జెట్ నిర్మాణము**

రాజ్యాంగములోని ఆర్టికల్సు 266 మరియు 267లను అనుసరించి ప్రభుత్వ బడ్జెట్ యొక్క మౌలిక నిర్మాణాన్ని క్రింది విధంగా వర్గీకరించారు.

(అ) రాష్ట్రం యొక్క కన్సాలిడేటెడ్ ఫండు

(ఆ) రాష్ట్రం యొక్క కంటింజెన్సీ ఫండు

(ఇ) పబ్లిక్ అకౌంట్

**(అ) రాష్ట్రం యొక్క కన్సాలిడేటెడ్‌ఫండు (పద్దులలో మొదటి భాగం)** : రాజ్యాంగంలోని 266(1) దీన్ని నిర్వచిస్తుంది. ప్రభుత్వ పద్దులలో ఇది మొదటి మరియు అతి ముఖ్యమైన భాగం. రాష్ట్ర ప్రభుత్వం చేసే ఖర్చులన్నింటిని రాష్ట్రం యొక్క కన్సాలిడేటెడ్ ఫండుకు డెబిట్ చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వాలు కన్సాలిడేటెడ్ ఫండుకు జమ చేసిన ఆదాయాల పద్దులను ఈ ఫండు నుండి చేసిన ఖర్చుల పద్ధతులను కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ సూచించిన పద్ధతిలో ఉంచాలి. కన్సాలిడేటెడ్ ఫండ్‌లో ఆదాయాల సెక్షన్ మరియు వ్యయాల సెక్షన్‌లు ఉంటాయి.

**(ఆ) రాష్ట్రం యొక్క కంటింజెన్సీ ఫండు (పద్దులలో రెండవ భాగం)** : రాజ్యాంగంలోని ఆర్టికల్ 267 దీన్ని నిర్వచిస్తుంది. ప్రభుత్వం ఈ నిధిని ఏర్పాటుచేస్తుంది. దీనిని కన్సాలిడేటెడ్ ఫండ్‌కి డెబిట్ చేస్తారు. ఈ నిధులని ప్రభుత్వం బడ్జెట్ అంచనాలు తయారుచేసే సమయంలో అనుకోకుండా ఎదురయ్యే సంఘటనల కోసం ఖర్చు చేస్తుంది. కంటింజెన్సీ ఫండు నిధులతో భరించిన ఖర్చులపై శాసనసభ నుండి తరువాత అనుమతిని పొందుతారు. ఈ ఖర్చును తరువాత సప్లమెంటరీ డిమాండ్ రూపంలో శాసనసభకు తెలియజేస్తారు.

**(ఇ) పబ్లిక్ అకౌంటు (పద్దులలో మూడవ భాగం)** : రాజ్యాంగంలోని ఆర్టికల్ 266 పబ్లిక్ అకౌంట్ యొక్క పరిధిని నిర్ణయిస్తుంది. ఈ పద్దులలో ప్రభుత్వం ఒక బ్యాంకర్‌గా నిర్వహించే లావాదేవీలన్నింటిని పొందుపరుస్తారు. ఇక్కడి ప్రభుత్వం తాను తీసుకున్న డబ్బును తిరిగి చెల్లిస్తుంది. లేకపోతే తాను ఇచ్చిన డబ్బును రాబట్టుకుంటుంది. ప్రావిడెంట్ ఫండు నుండి ఉద్యోగులకు చేసే

**ప్రభుత్వ బడ్జెట్ స్వరూపము / పద్దుల వర్గీకరణ**



చెల్లింపులను పబ్లిక్ అకౌంటుకు డెబిట్ చేస్తారు. అదేవిధంగా పబ్లిక్ వర్క్స్, నీటిపారుదల ప్రాజెక్టులు మొదలగు వాటిలో కాంట్రాక్టర్లు నుండి అందే డిపాజిట్లను పబ్లిక్ అకౌంట్‌కు జమ చేస్తారు. పబ్లిక్ అకౌంటులో సమకూరిన డబ్బుకు ప్రభుత్వం కాపలాదారుగా ఉంటుందే కాని దానికి ఆ డబ్బుపై ఎటువంటి అధికారం ఉండదు. పబ్లిక్ అకౌంటు చెల్లింపులకు రాష్ట్రశాసన సభ అనుమతి అవసరం లేదు.

**శాసన సభలో బడ్జెట్**

భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 202లో పొందుపరచినట్టు వార్షిక నివేదిక లేక 'బడ్జెట్'ను శాసన సభల ముందుంచాలి. శాసన సభలో బడ్జెట్‌కు అనుమతి ఇచ్చిన తరువాతనే, అంటే దానికి సంబంధించిన అప్రాప్రియేషన్ యాక్ట్ ఆమోదం తెలిపే వరకు అనేక అంచెలు వున్నాయి. ఇవి కింది విధంగా వుంటాయి.

| | | రోజులు |
|---|---|---|
| 1. | శాసన సభలో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడం | 1 |
| 2. | శాసన సభలో చర్చ ప్రారంభం కాకముందు గడిచిపోయే రోజులు | 2 |
| 3. | శాసన సభలో ఏకకాలంలో చర్చ | 6 |
| 4. | శాసన సభలో ప్రతిశాఖ యొక్క డిమాండ్స్ పై ఓటింగ్ | 18 |
| 5. | శాసన సభలో అప్రాప్రియేషన్ బిల్‌ను ప్రవేశపెట్టడం చర్చించడం, ఓటుకు పెట్టడం మరియు గవర్నరు ఆమోదాన్ని పొందడం | 2 |

ఈ పట్టికను బట్టి చూస్తే శాసన సభ్యులకు బడ్జెట్ గురించి శాసన సభలో చర్చలో పాల్గొనడానికి 26 రోజులు (పై )3), (4) మరియు (5) విషయాలు) అవకాశం ఉంటుంది.

**సాధారణ చర్చ :**

సాధారణ చర్చ యొక్క పరిధి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అభివృద్ధి కార్యక్రమాలలో సాధించిన ప్రగతి, ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో ప్రతిపాదించిన కొత్త పన్నులు, అభివృద్ధేతర ఖర్చు మొదలగు ప్రాధాన్యాంశాలకే పరిమితం చేస్తారు. ఈ స్థాయిలో ఓటింగు వుండదు. సాధారణ చర్చ చివరి రోజున ఆర్థిక మంత్రి చర్చాక్రమంలో లేవనెత్తిన విషయాలపై జవాబులను ఇస్తారు.

**శాసన సభలో డిమాండ్లపై ఓటింగు :**

ఇది బడ్జెట్‌పై చర్చలో రెండవ అంశం. శాసన సభలో వివిధ శాఖల డిమాండ్లపై చర్చిస్తారు. ఈ చర్చ 18 రోజులు కొనసాగవచ్చు. ఈ డిమాండ్లపై చర్చలో పాల్గొనే శాసన సభ్యులు చర్చలో ఆయా శాఖల డిమాండ్లను మాత్రమే పరిచయం చేయాలి. శాసన సభలో ప్రతి ఒక్క శాఖ డిమాండును చర్చించిన తరువాత దాని మీద ఓటింగు ఉంటుంది.

**అప్రాప్రియేషన్ బిల్లు ప్రవేశ పెట్టడం :**

వివిధ శాఖల డిమాండ్ల పై ఓటింగు పూర్తి అయిన తరువాత కన్సాలిడేటెడ్ ఫండు నుండి డబ్బును ఉపయోగించుకోవడానికై అప్రాప్రియేషన్ బిల్లును ప్రవేశపెడతారు. ఈ సందర్భంలో డిమాండ్లు పై ఓటింగు సమయంలో చర్చకు రాని శాఖల గురించిన విషయాలను లేవనెత్తడానికి శాసన సభ్యులకు అవకాశం ఉంటుంది.

అప్రాప్రియేషన్ బిల్లును శాసన సభలో ఓటింగుకు పెడతారు. సభలో ఆమోదం పొందిన తరువాత బిల్లును గవర్నరు ఆమోదం కోసం పంపుతారు. గవర్నరు ఆమోదం పొందిన బిల్లు చట్టరూపం సంతరించుకుంటుంది. ఈ చట్టంలో చూపిన సొమ్ము బడ్జెట్ అనుమతించిన గ్రాంటు అవుతుంది. ఆయా శాఖలు వాటికి కేటాయించిన సొమ్మును కన్సాలిడేటెడ్ ఫండు నుండి వాడుకోవచ్చు.

పైన చర్చించిన దానిని బట్టి బడ్జెట్ ప్రతిపాదనలు ఒక కొలిక్కి రావడానికి 34 రోజులు పడుతుంది. ఇందులో 26 రోజుల చర్చకు శాసన సభ్యులకు అవకాశం ఉంటుంది. బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజునే బడ్జెట్ ప్రచురణలన్నీ శాసనసభ్యులకు అందుబాటులో వుంటాయి. పెర్‌ఫార్మెన్స్ బడ్జెట్ ప్రతులు అన్నీ సాధారణ చర్చ ప్రారంభమయ్యే సమయానికి సభ్యులకు అందుబాటులో వుంటాయి. ఈ విధంగా శాసన సభలో ఫలవంతమైన, అర్థవంతమైన చర్చలు చోటు చేసుకోవటానికి వీలుగా బడ్జెటుకు సంబంధించిన సమాచారం అంతా శాసన సభ్యులకు అందుబాటులో వుంటుంది. వివిధ శాఖల డిమాండ్లపై చర్చించడానికి 18 రోజుల సమయం ఉంటుంది. అయితే ఈ సమయాన్ని కుదించే అధికారం శాసనసభ స్పీకర్‌కు ఉంటుంది. దీనికి స్పీకర్ సభానాయకునితో చర్చిస్తారు. అయితే శాసన సభ్యులు బడ్జెటు చర్చలు జరిగే రోజులను పెంచమంటూ స్పీకర్‌ను ఒప్పించవచ్చు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పూర్తి బడ్జెట్‌కు ఆమోదం లభింప చేసేందుకు వీలుగా బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజుకు, ఆర్థిక సంవత్సరం ఆఖరు రోజుకు, అంటే మార్చి 31వ తేదీకి మధ్య 34 రోజుల వ్యవధి ఉండేటట్లు జాగ్రత్తపడతారు. అయితే ఈ మధ్య బడ్జెట్‌ను మార్చి నెల మధ్యలో ప్రవేశపెట్టడం వలన మార్చి నెలాఖరుకు బడ్జెట్ ఆమోదం పొందడానికి వీలుకావడం లేదు.

ఈ సమస్యను అధిగమించడానికి రెండు నెలలకు ఎప్రిల్ మరియు మే) మార్చి నెలాఖరులోగా ఓట్ ఆన్ అకౌంట్‌ను ఆమోదింపజేస్తారు. మొత్తం బడ్జెట్ మీద చర్చను ఎప్రిల్ నెల వరకు పొడిగిస్తున్నారు. జిల్లా పరిషత్తులకు చెల్లించవలసిన వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సుల అంచనాను ప్రభుత్వం యొక్క గ్రామీణ అభివృద్ధి శాఖ తయారుచేస్తుంది.

బడ్జెట్ రూపకల్పనకు సంబంధించి దానికై నియమింపబడ్డ అధికార యంత్రాంగం గురించి కొంత అవగాహన కలుగుతుంది. ఈ అవగాహన బడ్జెట్ తయారీలో నిమగ్నమైన వారికే కాక బడ్జెట్ రాయితీలను పొందే వివిధ టార్గెట్ గ్రూపుల సంక్షేమం కాంక్షించే వారికి వారి సంక్షేమం కొరకై పనిచేసే వారికి కూడా అవసరం. బడ్జెట్ యొక్క పరిమాణం వివిధ శాఖల క్రింద ఉన్న అసంఖ్యాకమైన కేటాయింపులను దృష్టిలో ఉంచుకున్నప్పుడు మానవ హక్కుల ఉద్యమకార్యకర్త తన ప్రయత్నాలు ఫలవంతం కావడానికి తాను పరిశోధించదలుచుకున్న అంశాలను నిర్ధారించుకోవడం అత్యవసరం.

అణగారిన దళిత వర్గాల సంక్షేమం కొరకు ప్రవేశపెట్టిన పథకాలు, వాటి ప్రయోజనాలు అవసరమైన వారికి అందాయా లేదా అని పరిశోధించి తెలుసుకోవడం ఈ ప్రయోజనాలు సరిగా అందని ప్రదేశాల్లో పరిపాలనా యంత్రాంగం చురుకుగా పనిచేసేటట్లు చూడటానికి అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించు కోవడం మానవ హక్కుల ఉద్యమకార్యకర్తల యొక్క విధి. ఈ విధి విధానాల అమలుకోసం దళిత మానవహక్కుల కోసం పనిచేసే ప్రతి ఒక్కరూ పాటుపడవలసిన అవసరం ఎంతైనా ఉంది. ●

# మునిగిపోతున్న కొల్లేరు దళితుల బతుకులు

...✍ - **జి. నర్సింహ్మ**, భూ సాధన కార్యదర్శి

పశ్చిమ గోదావరి (జిల్లా), ఏలూరు (మం), కొల్లేరు సరస్సు పరిసరాలతో 76గ్రామాలు కలవు. ఇక్కడి ప్రజలు చేపల చెరువులపై ఆధారపడి జీవించేవారు అధికముగా ఉన్నారు. స్త్రీలు కూలీపనులు, పురుషులు చేపలు పట్టి, వాటిని అమ్మి జీవనం సాగిస్తూ ఉన్నారు. ఎండాకాలంలో సరస్సులో నీరు లేక ఎండినపుడు వ్యవసాయం చేసుకుని వచ్చిన పంటతో సం॥ కాలం జీవించేవారు. 1975వ సం॥రంలో ఫిషర్‌మెన్ సొసైటీలు ఏర్పాటుచేసి ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా మరియు జలగం వెంగళరావు సి.ఎం. గా వున్నప్పుడు ప్రతి ఒక్కరికి 1/2 ఎకరము భూమిపై పట్టాలు ఇచ్చి, చేపల చెరువులకు లోన్లు ఇచ్చారు. చేపలు పెంచుకుని లాభాలు ఆర్జించి, తమ పిల్లలను చదివించుకుంటున్న తరుణంలో 1978, 1984, 1996 లో పెద్ద తుపాన్లు వచ్చి పెంచిన చేపలు సముద్రంలో కలిసాయి. వారికున్న చేపల చెరువులను లీజుకిచ్చారు. అన్ని పెట్టుబడులు పన్నులు కట్టుకున్న తరువాత వారికి ఎకరాకు రూ. 1500/- లు చొప్పున సం॥రానికి ఇచ్చేవారు. దానితో పాటు కూలిచేసి జీవించేవారు. ఈనాడు అన్యాక్రాంతమయిన కొల్లేరును కూల్చారు. యువకులు వలసవెళ్ళి, పనిచేసి తెచ్చిన కూలీ డబ్బులతో దుర్భర జీవితం వెళ్ళదీస్తున్నారు. అంతేకాక, కొక్కిరాయి లంక గ్రామం, ఏలూరుకు 20 కి.మీ దూరంలో కలదు. ఈ గ్రామవాసులు ఏమి అవసరమైనా, ఏలూరు నుండి తెచ్చుకోవాలి. ప్రయాణసౌకర్యము కూడా సరిగా లేదు. రోజుకు ఒక్కసారి మాత్రమే బస్సు వస్తుంది. సరైన రోడ్డుసౌకర్యము లేదు.

**ఇక్కడ ఎస్.సి, ఎస్.టి, బిసిలు జీవిస్తారు. ఎస్.సిలలో మాలలు అత్యధికముగా ఉన్నారు. ఒకటి, రెండు కుటుంబాలు మాదిగలు ఉంటారు. అందరూ కలిసి జీవిస్తారు. ఈనాటి వరకు ఆ గ్రామంలో ఎవరూ పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళలేదు. అలా వెళితే నవ్వుతారు. అందరూ కూలీలుగానే జీవిస్తున్నారు. వారిలో ఎవరి ఆధిపత్యము లేదు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు గ్రామ సర్పంచి ఆధ్వర్యములో పెద్దలు కూర్చుని పరిష్కరిస్తారు. వారికున్నది ఒక్కటే సమస్య అదే కొల్లేరు భూమి సమస్య. వారు ఎమ్.ఎల్.ఎ, ఎంపిలను కలిశారు. విన్నవించుకున్నారు కానీ, వారి చేపల చెరువులు వారికి అప్పజెప్పడంలేదు.**

మండలంలోని అన్ని గ్రామాలకు అదే పరిస్థితి. ఒక్కొక్క ఇంట్లో రెండు, మూడు కుటుంబాలు ఉన్నాయి. ప్రభుత్వం 0.2 సెంట్లు స్థలము ఇచ్చింది. అందులో నీళ్ళు ఉంటాయి. అవి పూడ్చి ఇళ్ళు కట్టుకోవాలి. పూడ్చాలంటే మట్టికావాలి. మట్టి తీయడానికి ఎక్కడ అవకాశము లేదు. కొంతమంది జిరాతీ భూముల్లో ఉన్న చేపల చెరువులు కూల్చలేదు. ఈ కొల్లేరు మొత్తము ఫారెస్టు వాళ్ళు స్వాధీనం చేసుకున్నారు. ఏది ముట్టినా అరెస్టులు, పహారా, ప్రభుత్వ భూమిలో 3,400 ఎకరాల చేపల చెరువులు మిగిలిఉన్నాయి. ఫిషర్‌మెన్ సొసైటీల పేరుతో ఉన్న వారికి పంచినట్లైతే 2,500 నుండి 2,900 ఎకరాలు చెందుతుంది. మిగిలిన 600 ఎకరాలు కొత్తగా పెళ్ళి చేసుకున్న కుటుంబాలకు ఇవ్వవచ్చు. ఏమి ఆదాయ వనరులు లేనందున వారికి అది కొంత జీవనోపాధి కలుగుతుంది. ఉన్న చేపల చెరువులను కూల్చడంతో వారు నిరాశ్రయులైనారు. త్రాగునీరు 3 నుంచి 5 రోజులకొకసారి అందిస్తారు. ఆ విధముగా నిల్వ ఉన్ననీటిని త్రాగడంలో రోగాల బారిన పడుతున్నారు.

కొక్కిరాయి లంక గ్రామం ఫిషర్‌మెన్ సొసైటీ పేరు "హరిజన ఫిషర్‌మెన్ సొసైటీ" ఇందులో 50 నుంచి 100 మంది సభ్యులు ఉంటారు. గతంలో వీరికి ఇచ్చిన పట్టాభూములలోని చేపల చెరువులు తుఫాను ప్రభావంతో నష్టపోయారు. పెట్టుబడులను పూడ్చుకోలేక లీజుకిచ్చి, వారి వద్దే కూలీ పనిచేస్తున్నారు. లీజుకు తీసుకున్నవారు పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టి, లక్షల కొద్ది లాభాలు ఆర్జిస్తున్నారు. ఇతర దేశాలకు ఎగుమతులు చేస్తున్నారు. లారీలు రావడానికి రోడ్లు వేశారు. గతంలో రోడ్లు లేవు. తాటి చెట్టుతో చేసిన దోనెలపైన, పడవల పైన వెళ్ళేవారు. ప్రభుత్వాలు మారుతున్నందున, లీజుదారులు టిడిపి వాళ్ళు ఉన్నారని కొల్లేరు ప్రక్షాళన, పూర్వవైభవము తెస్తామని వేల ఎకరాలలో ఉన్న చేపల చెరువులను ప్రొక్లైనర్లతో కూల్చారు. హైకోర్టు నుంచి ముగ్గురున్యాయవాదుల కమిటి సా॥ గం॥లకు వచ్చి 6 సం॥రాలకు వెళ్ళారు. బాధితులకు మాట్లాడే అవకాశము ఇవ్వలేదు.

గతంలో కొల్లేరు ఎటు చూసినా, నీటితో కళకళలాడుతూ ఉండేది. ఎన్నో జాతుల పక్షులు ఇక్కడికి వలసవచ్చేవి. పర్యాటక ప్రాంతంగా విరాజిల్లేది. నగరాలు పెరగడం, కలుషితమైన నీరు రావడం, అదే విధంగా చేపల చెరువులు ఏర్పాటుచేయడం వలన కలుషితమైంది. పూర్వ వైభవాన్ని తీసుకురావాలని ఒక పక్క అయితే, లీజుదారులు టిడిపి వాళ్ళ చేతుల్లో ఎక్కువ ఉందని ఈనాటి ప్రభుత్వం, కలెక్టర్ దగ్గరుండి కూల్చివేశారు. ప్రభుత్వ నిర్ణయం ద్వారా బాధితులు నిరాశ్రయులైనారు.

**డిమాండ్స్ :**

1. కొల్లేరులో ఉన్న లక్షల ఎకరాల ప్రభుత్వ భూమిని చేపల చెరువుల కోసం 76 గ్రామాల పేద ప్రజలకు ఒక ఎకరము చొప్పున పంపిణీ చేయాలి. లేదా ఇతర ప్రాంతాలకు తరలించి సాగుభూములు పంపిణీచేసి, ఇళ్ళు, ఇండ్లస్థలాలు మంజూరు చేయాలి.
2. కొల్లేరు చెరువులు కూల్చగా మిగిలిన 3,400 ఎకరాలను రిజిస్టర్ అయిన సొసైటీలకు అప్పచెప్పాలి.
3. వీరి ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వమే పెట్టుబడులు పెట్టి చేపల చెరువులు నిర్మించి ఇవ్వాలి.
4. రోడ్లు, మార్కెట్, వైద్య, ఆరోగ్య, మంచినీరు, ఇతర సదుపాయాలు కల్పించాలి.

●

# పోలీసు వ్యవస్థ సంస్కరణకై సుప్రీంకోర్టు మార్గదర్శకాలు

1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానంతరం వలసవాద బ్రిటిష్ ప్రభుత్వం 1861లోపోలీసు చట్టాన్ని చేసింది ఈ చట్టం స్వాతంత్రోద్యమ పోరాటం నడిచి నంతకాలం ఉద్యమాల అణచివేతలో కీలకపాత్ర పోషించింది. స్వాతంత్ర్యం తరువాత కూడా దేశీయ పరిస్థితులకు అనుకూలంగా 1861 చట్టంలో మార్పులు, చేర్పులు, తీసుకరాకపోగా ఇదే వలసవాద చట్టాన్ని పాలకులు ఉనికిలో వుంచడం శోచనీయం. స్వాతంత్ర్యానికి పూర్వం దాదాపుగా శతాబ్దకాలం, స్వాతంత్ర్యం తరువాత అర్ధశతాబ్దికిపైగా 1861 నాటి ఉక్కు చట్టం రాజ్యం చేస్తూనేవుంది. పోలీసు వ్యవస్థలో సంస్కరణలకై 30సంవత్సరాల నుండి అనేక మార్లు కమిటీలు వేశారు. ఈ కమిటీలు 1. జాతీయ పోలీసు కమీషన్ (1979-1981) 2. రబీరోకమిటీ (1998-1999) 3. పద్మనాభయ్య కమిటి (2000) 4. సోలిసొరాజ్జి కమిటి (2005) ఈ కమిటీలన్ని వాటి వాటి నివేదికలను, సూచనలు చేస్తూ సమర్పించినాయి. జాతీయపోలీసు కమీషను 24 సూచనలు చేసింది.

**జాతీయ పోలీసు కమీషను :** 1879 నుండి 1981 వరకు జాతీయ పోలీసు కమీషన్8 నవేదికలు మరియు ముసాయిదా పోలీసు చట్టాన్ని కేంద్రప్రభుత్వానికి సమర్పించింది.

**జాతీయ పోలీసు కమీషను సిఫారుసులు :**

1. పోలీసు బోర్డు ఏర్పాటు చేయుట
2. పోలీసు కస్టడీలో మరణాలు, పోలీసు కస్టడీలో మానభంగాలు, పోలీసు కాల్పుల్లో ఇద్దరు కన్నా ఎక్కువ మంది మరణించిన సందర్భాలలో జుడిషియల్ ఎంక్వైరీ జరిపించాలి.
3. పోలీసు వ్యవస్థలో రాజకీయనాయకుల మరియు ప్రభుత్వ జోక్యం లేక పోవుట.
4. రాష్ట్ర DGP లను నియమించు చోటకు గాను యూనియనే పబ్లిక్ సర్వీసు కమీషను అధ్యక్షుని అధ్యక్షతన ఉన్నతాధికార కమిటి ఏర్పాటు.
5. బదిలీలు, సస్పెన్షన్లు నిర్దిష్ట పద్దతిలో జరగాలి. వారి వేధింపుల నుండి పోలీసులు కాపాడబడే విధంగా పోలీసు చట్టం వుండాలి.
6. దళితులపై జరిగే అత్యాచారాలను విచారించుటకు జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రత్యేక విభాగాల ఏర్పాటు.
7. పోలీసు స్టేషను అధికారిని నియమించుటకు జిల్లా SPకి జిల్లా ఎస్పిని నియమించుటకు DGPకి అధికార బాధ్యతలు ఇవ్వాలి.
8. పౌరులను అరెస్టు చేయడానికి, బేడీలు వేయడానికి మార్గ దర్శక సూత్రాలు.
9. పోలీసు స్టేషన్‌లో ప్రతి దినము జరిగే పనులకు సరిపడినంత డబ్బునుకెటాయించి అవినీతిని అరికట్టుట.
10. ఏపోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా FIR నమోదు చేసి ఆ తరువాత సంబందిత పోలీసు స్టేషన్‌కు దానని పంపుట
11. పోలీసులు సాక్షిని విచారించే టప్పుడు ఇంటి దగ్గరకాని, సమీపంలో కాని విచారించుట.
12. దొంగిలించబడిన వస్తువు దొరికితే వీలైనంత తొందరగా దాని యజమానికి అందజేయుట.
13. ఒక వ్యక్తిని అరెస్టు చేసినపుడు తప్పని సరిగా అతని బంధవులుకు తెలియజేయుట.
14. తరచుగా పోలీసు వున్నతాధికారులు తనిఖీలు చేసి, అరెస్టు అయిన వ్యక్తికి ఎటువంటి హాని జరగకుండా చూడాలి.
15. పోలీసు కానిస్టేబుల్ మరియు IPS ఈ రెండు స్థానాలకు వుద్యోగ భర్తీలు వుండాలి. మిగిలిన హోదాలు పదోన్నతుల ద్వారా జరగాలి. వుద్యోగంలో చేరేముందు సరైన శిక్షణ యివ్వాలి.
16. పోలీసు శాఖ చట్టానికి లోబడి పని చేయాలి. జిల్లా కలెక్టర్ వివిధ శాఖల సమన్వయానికి మాత్రమే వుండాలి. జిల్లా పోలీసులు కలెక్టరు ఆధీనంలో పనిచేయకూడదు.
17. అవినీతి. పక్షపాతం, అసమర్థత, వంటి వాటితో సమాజంలో పోలీసు శాఖ చిన్న చూపుకు గురైంది. దీన్ని సరిచేయడానికి పోలీసు వారిలో ప్రజలతో మరియు క్రిందిస్థాయి వుద్యోగులతో ప్రవర్తించే తీరులో మార్పురావాలి.
18. మహిళలు మరియు పిల్లలకు సంబంధించిన నేరాలను మహిళా పోలీసులు చేపట్టాలి. మగవారితో సమానంగా మహిళా పోలీసులు పనిచేసే వ్యవస్థ నెలకొల్పాలి.
19. వున్నతపదవుల్లో ప్రమోషన్ యిచ్చినపుడు ప్రమోషన్ కోర్సు తీసుకోవాలి. ఆపరీక్షల్లో వుత్తీర్ణులు కావాలి. మూడుసార్లు తప్పిన వ్యక్తిని ఉద్యోగం నుండి పదవీ విరమణ చేయించాలి.
20. త్వరితగతిని నిర్ణయాలు తీసుకొనుటకు 5 లక్షలకు మించిన జనాభా కలిగిన పట్టణాలలో పోలీసు కమీషన్‌రేటు స్థాపించాలి.
21. పోలీసు స్టేషన్ పరిధిలో సాధారణ పర్యావేక్షణ, మరియు విచారణ వేరు వేరుగా వుండాలి. విచారణ విభాగం ఒక గజిటెడ్ ఆఫీసరు క్రింద వుండాలి. కొన్ని సందర్భాలు మినహాయించి మిగిలిన వాటిలో పారదర్శకత వుండాలి.
22. ఒక పోలీసు స్టేషను పరిధి 150 కి.మీ మించ కుండావుండాలి. పట్టణాలలో జనాభా ప్రాతిపదికన 60,000 జనాభాకు ఒక పోలీసుస్టేషను వుండాలి.
23. పోలీసు శాఖలో కానిస్టేబులు వంటి చిన్న వుద్యోగుల సంఖ్య తగ్గించి సబ్ ఇన్‌స్పెక్టర్ మరియు సర్కిల్ ఇన్‌స్పెక్టరు వంటి మధ్యంతర వుద్యోగాలు పెంచాలి. సగటున 4:1 నిష్పత్తిలో వుండాలి.
24. పోలీసు వ్యవస్థ పనితీరును నిరంతరం పరిశీలించి శాసన శాఖకు నివేదికను అందజేయుటకు రాష్ట్ర స్థాయిలో ఒక రాష్ట్ర భద్రత కమీషను ఏర్పాటు చేయాలి.

**రొబిరొ కమిటి (1998-1999) సూచనలు :**

1. పోలీసు శాఖ పనితీరు మరియు భాద్యతలు పర్య వేక్షించడానికి రాష్ట్ర స్థాయిలో ఒక కమీషను స్థాపన.
2. జిల్లా స్థాయిలో జిల్లా పోలీసు పిర్యాదుల సంస్థఏర్పాటు
3. DGP మరియు నలుగురు సీనియర్ ఆఫీసర్లతో ప్రమోషన్, బదిలీలు, శిక్షణ వంటి వాటిపై తగు నిర్ణయాలు తీసుకొనుటకు పోలీసు ఎస్టాబ్లిష్ మెంటు బోర్డు స్థాపన. మరియు ప్రభుత్వం ఇందుకు సంబందించిన స్పష్టమైన నిబంధనలు చేయాలి.
4. విచారణ చేపట్టే అధికారాలు శాస్త్ర పరమైన శిక్షణ ఇవ్వాలి. ఎట్టి వత్తిళ్ళకు లొంగకుండా, పక్షపాతం లేకుండా విచారణ జరిగే పరిస్థితులు కల్పించాలి. ఈ శాఖలో అధికారులను 5సం॥ వరకు బదిలీ చేయరాదు.

5. జాతీయ పోలీస్ కమీషన్ తెలిపినవిధంగా పోలీసు శాఖల్లో భర్తీలు, శిక్షణ, పదోన్నతి వంటి విషయాలు పాటించాలి.

**పద్మ నాభయ్య (పద్మనాభయ్య కేంద్ర హోం సెక్రటరీ) నివేదిక (2000) సూచనలు :-**

1. 1861 పోలీసు చట్టం స్థానే కొత్త చట్టం తేవాలి.
2. నిర్ణయించిన శిక్షణ మరియు అవసరమైన పరిక్షలలో వుత్తీర్ణులైన వారికి మాత్రమే పదోన్నతి కల్పించాలి.
3. రాజకీయ ఒత్తిడులకు లోబడి బదిలీలు లేకుండా ఒక నిర్ణీతకాల గడువు వుండాలి.
4. ప్రతి జిల్లాలో నేరాలు అడ్డుకోవడానికి ఒక ప్రత్యేక బృందం వుండాలి. దానిలో సుశిక్షితులైన అధికారులు వుండాలి.
5. శాంతి భద్రతల విభాగం మరియు నేరపరిశోధన విభాగం వేరు వేరుగా ఉండాలి.
6. పోలీసు జవాబుదారీ తనంకోసం, అధికార, అనధికారుల ఒక సంస్థనెలకొల్పాలి.
7. అవినీతి పోలీసు అధికారులపై చర్యలకు ప్రస్తుత రూల్సులో మార్పులు చేసి అవినీతి అధికారులను హద్దుల్లో వుంచాలి.
8. ముఖ్యమైన వ్యక్తుల రక్షణ గురించి పరిశీలించి అవసరం లేనిచోట తీసివేయాలి.
9. పోలీసు శాఖ నిర్వహిస్తున్న పనుల దృష్ట్యా వారికి శెలవులు ఇతర సదుపాయాలు కలుగజేయాలి.

<u>ప్రకాశ్‌సింగ్ ప్రజాప్రయోజనాలవ్యాజ్యం :</u>

పై నేపద్యంలో 1996 సం॥లో ప్రకాశ్‌సింగ్ (రిటైర్డు) మరియుNK సింగ్ (రిటైర్డ్ డిజిపి)లు జాతీయ పోలీసు కమీషను సిఫారసులు అమలు చేయాలని కోరుతూ ఒక ప్రజాప్రయోజనాల పిటిషన్‌ను సుప్రింకోర్టులో శాఖలు చేసారు. తదనంతరం సెప్టెంబర్ 2005లో పోలీసు చట్టం రచనాసంఘాన్ని కేంద్రహోంశాఖ సోలిసోరాబ్జి అధ్యక్షతన ఏర్పాటు చేసింది. ఈ కమిటి అక్టోబర్ 31,2006 నాడు తననివేదికను సమర్పించింది తదనంతరం సుప్రీకోర్టు ప్రకాశ్‌సింగ్ వ్యాజ్యంపై తీర్పును సెప్టెంబర్ 22,2006న వెలువరించి ఏడు మార్గదర్శకాలను రూపొందించింది వాటిని అన్ని రాష్ట్రాలు జనవరి 11,2007 నాటికి 2,3,5 ఆదేశాలను అమలు చేయాలని పేర్కొన్నది. 1,4,6,7 అదేశాలను అమలుచేయడానికి 31 మార్చి 2007 వరకు గడువు యిచ్చింది. వీటిని అమలు చేస్తున్నట్లు అఫెడవిట్లు దాఖలు చేయడానికి 10 ఏప్రిల్ 2007 వరకు గడువుయిచ్చింది. ఈ లోపులో 6రాష్ట్రాలు రివిన్యూ పిటిషన్లు దాఖలు చేసాయి. కాని 27 ఆగస్టు 2007 నాడు ఆపిటిషన్లను ధర్మాసనం కొట్టివేసింది. ఆదరిమిలా ప్రకాశ్‌సింగ్ కోర్టుధిక్కార పిటిషను దాఖాలు చేశాడు. ఆపిటిషనును ధర్మాసనం 14 డిసెంబర్ 2007 పరిశీలిచింది. వాదోపవాదాలు విన్న సుప్రీంకోర్టు, ఆదేశాలను నెరవేర్చడానికి 11 మార్చి 2008 తేదీని తుదిగడువుగా నిర్ణయించింది.

**సుప్రింకోర్టు ఆదేశాలు :**

1. స్టేట్ సెక్యూరిటి కమీషన్ను ఏర్పాటుచేయాలి. ఈ కమీషన్ (ఎ) పోలీసు మీద రాష్ట్ర ప్రభుత్వ అనవసర వత్తిడిని లేకుండా చూడాలి (బి) విస్తృత విధానపరమైన మార్గదర్శకాలను రూపొందించాలి. (సి) రాష్ట్ర పోలీసులు పనితీరును మూల్యాంకనము చేయాలి.
2. పారదర్శక విధానంతో, ప్రతిభ ఆధారంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసును నియమించాలి. పదవీవ కాలాన్ని రెండు సంవత్సరాలుగా నిర్ణయించడం.
3. జోనల్ బాధ్యుడైన ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు, రేంజి భాద్యుడు అయిన డిప్యూటి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు, జిల్లా భాద్యుడైన పోలీసు సూపరింటెండెట్, మరియు స్టేషన్ హౌస్ ఆఫీసు వారికి కనీసం 2సంవత్సరాల పదవీ కాలం వుండాలి.
4. పోలీసు ఎస్టాబ్లిష్‌మెంటు బోర్డు ఏర్పాటు చేయడం ఇది డిప్యూటి సూపరింటెండెంట్ స్థాయికన్నా తక్కువకాని వారి నియామకాలు, బదిలీలు, పదోన్నతి ఇతర పాలనా సంబంధమైన విషయాలను చూస్తుంది. అంతేకాకుండా డిప్యూటి సూపరింటిండెంట్ కన్నా ఎక్కువ హోదాకలవారి ఉద్యోగాలు, నియామకాలు, బదలీలకు సంబందించిన సిఫారసులు చేస్తుంది.
5. కేంద్ర స్థాయిలో జాతీయ సెక్యూరిటీ కమీషను ఏర్పాటు చేయుట. ఇది సెంట్రల్ పోలీసు ఆర్గనైజేషన్ల ముఖ్య అధికారుల ఎన్నికకు తగిన వ్యక్తుల పట్టికను తయారు చేసి సంబందిత నియామక అధికారుల ముందు వుంచుతుంది. వీరి పదవీకాలం కూడా 2సం॥రాలు. ఇది ఆయా అధికారుల పనితీరును అంచనా వేస్తుంది. వారి సర్వీసు స్థితి గతులను మెరుగుపరుస్తుంది. ఇది కేంద్రప్రభుత్వ హోంశాఖ మంత్రి ఆధీనంలో వుంటుంది.
6. పోలీసు ఫిర్యాదుల అధికారి : డిప్యూటి సూపరింటిండెంట్ ఆఫ్ పోలీసు స్థాయివరకు వున్న పోలీసు అధికారులపై వచ్చే అభియోగాలను పరిశీలించడానికి జిల్లా స్థాయిలో ఒక పోలీసు కంప్లైంట్ పధారిటి వుంటుంది. సూపరింటిండెంట్ కన్నా పై స్థాయి పోలీసులపై అభియోగాలను పరిశీలించడానికి రాష్ట్ర స్థాయిలో ఒక పోలీస్ కంప్లైంట్ అధారిటి వుంటుంది.

   జిల్లా స్థాయిలో అధారిటికి పదవీవిరమణ చేసిన జిల్లా జడ్జి బాద్యత వహిస్తారు. అట్లాగే రాష్ట్ర స్థాయి అధారిటీకి పదవీవిరమణ చేసిన హైకోర్టు న్యాయమూర్తి బాద్యత వహిస్తారు.
7. దర్యాప్తు పోలీసులు, శాంతి భద్రతల పోలీసులను వేరుచేయుట. ప్రజలతో సరైన సంబంధాల కొరకు, నైపుణ్యంగా పని చేయడానికి, సత్వరమే దర్యాప్తు పూర్తిచేయడానికి గాను దర్యాప్తుపోలీసులను శాంతిభద్రతల పోలీసుల నుండి వేరు చేయాలి. అయినా ఈ రెండు విభాగాల మధ్య పూర్తి సమన్వయము ఉండే చూడాలి. పదిలక్షలు అంతకన్నా ఎక్కువ జనాభావున్న నగరాలు పట్టణాలతో ఈప్రక్రియ ప్రారంభించి క్రమేపి చిన్న చిన్న పట్టణాలకు, అర్బన్ ప్రాంతాలకు విస్తరింపజేయాలి.

అయితే చాలా రాష్ట్రాలు కొన్ని మార్పులతో కొన్ని పూర్తిగాను సుప్రింకోర్టు మార్గ దర్శకాలను అమలుచేయడానికి ముందుకొచ్చాయి. ఈ క్రింది రాష్ట్రాలు కొత్తపోలీసు చట్టాలను ఆమోదించారు.

1. హర్యానా (మార్చి21,07) 2. బీహర్ (28మార్చి07)

2. త్రిపుర (29 మార్చి07) 4. గుజరాత్ (20జులై07) 5. ఛత్తీస్‌ఘడ్ (20జూలై07) 6. అస్సాం. (8 ఆగస్టు 07) 7. హిమాచల్ ప్రదేశ్ (ఆగస్టు 28, 07) 8. కేరళ (సెప్టెంబర19,07) 9. రాజస్థాన్ (21 సెప్టెంబర్ 2007)

ఈ క్రింది రాష్ట్రాలు ముసాయిదా చట్టాలను తయారు చేసే ప్రక్రియలో వున్నాయి. 1. మధ్యప్రదేశ్, 2. ఒరిస్సా, 3. ఆంధ్రప్రదేశ్ 4. అరుణాచల్ ప్రదేశ్, 5. పంజాబ్ 6. జార్ఖండ్, 7. తమిళనాడు 8. మేఘాలయ 9. కర్ణాటక.

1. మణిపూర్ 2. సిక్కిం రాష్ట్రాల్లో ముసాయిదా పూర్తి అయింది. పశ్చిమ బెంగాల్, జమ్ముకాశ్మీర్ రాష్ట్రాల్లో ముసాయిదా చట్టం రాయడానికి కమిటీలు ఏర్పాటు చేయబడినాయి.

(☛ తరువాయి 11వ పేజిలో ..... )

# దళితులు ముఖ్యమైన ప్రభుత్వాధికారాలలో ఉన్నప్పటికీ, వారికి అగ్రవర్ణాల దాడుల నుండి రక్షణలేదా?

నల్గొండ జిల్లాలోని వేములపల్లి మండల రెవిన్యూ అధికారి శ్రీదైద. నాగయ్య పై ఆయన పని చేస్తున్న ఆఫీసులోనే, అనేక మంది అధికారులు మరియు ఇద్దరు మీడియా ప్రతి నిధులు చూస్తుండగా కె. చిన్నలింగారెడ్డి అనే వ్యక్తి దాడి చేసిన సంఘటన చోటుచేసుకుంది. నా 31 సంవత్సరాల ప్రభుత్వ సర్వీస్‌లో ఇటువంటి చర్యనాకు ఎన్నడూ అనుభవంలోకి రాలేదని శ్రీ నాగయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. సాక్షి, మానవ హక్కుల నిఘా ఆధ్వర్యంలో నిర్వహించిన పబ్లిక్ హియరింగ్‌లో తన వేదనను వినిపించారు.

శ్రీ నాగయ్య తన వివరణలో లింగారెడ్డి అనే వ్యక్తి (40) జనవరి 21వ తేదీన తన వ్యవసాయ భూమికి సంబంధించిన నకళ్ళ కొరకు మండల రెవిన్యూ కార్యాలయములో వినతి పత్రాన్ని సమర్పించారు. తరువాత జనవరి 24న అదే విషయాన్ని గురించి కనుక్కొనుటకు వచ్చినప్పుడు, శ్రీనాగయ్య మీటింగ్‌లో ఉన్నాను. గంట తరువాత రావలెనని కోరడం జరిగింది. తరువాత చిన్న లింగారెడ్డి అర్థగంట ముందుగానే వచ్చి, తమ కోరిన సదరు నకళ్ళు వెంటనే ఇవ్వ లేదనీ కోపంతో శ్రీనాగయ్యను చెంపమీద మయరియు కడుపులో కొట్టి, కులం పేరుతో దూషించి, దుర్భాషలాడాడు, మండల ఎగ్జికూటివ్ మేటిస్ట్రేట్ అయిన తనపైనే అంతటి ధౌర్జన్యం జరిగేటప్పటికి నాగయ్య గారు తీవ్రషాక్‌కు గురైనారు. పోలీసులు, భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 332 ప్రకారం, మరియు షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల అత్యాచారాలు నిరోధక చట్టం 1989 ప్రకారం కేసు నమోదు చేసి, నిందితుని అరెస్టు చేయడం జరిగింది.



గతంలో వేములపల్లి వచ్చిన నలుగురు దళిత యంఆర్ఓ లను కూడా వేధించిన నేర చరిత్ర లింగారెడ్డికి ఉందని, శ్రీనాగయ్య వివరించారు. వేములపల్లి మండలంలో సిపిఐ(యం) బలోపేతమైన మండలమనీ, అయినా లాభకరంగా లేదని ఆవేదన చెందారు.

మీకున్న అధికారాలు మిమ్మల్ని ఎందుకు రక్షించలేకపోయాయి? అన్నప్రశ్నకు ఆయన జిల్లాలోని ప్రతి ప్రభుత్వ విభాగమునకు రెడ్డి కులస్తులే అధికారులుగా ఉన్నారు. స్థానిక యంఎల్‌ఎ కూడా రెడ్డి కులస్తుడు. కావడంతో "కులతత్వం" బాగా పని చేసింది. పైనుండి రాజీకొరకు వత్తిడి చేస్తున్నారు. కేసును ఆపేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. అన్నారు.

ఈ విషయంపై సాక్షి, డైరెక్టర్ వి. నందగోపాల్ మాట్లాడుతూ కులాధిపత్యం, అహంకారమే ఇంతటి ధౌర్జన్యానికి కారణమని, అందువల్లనే చట్టాన్ని రక్షించే ఒక మండల తహసిల్దార్ పైనే ఎస్సీ,ఎస్టీ పిఓఎ చట్టంక్రింద దౌర్జన్యం జరిగితే వెంటనే అరెస్టు చేయవలసి యుండగా నాలుగు రోజుల పాటు నిందితుని రక్షించడం జరిగిందన్నారు.

**శ్రీమతి అఖిలేశ్వరి**

*(డెక్కన్ హెరాల్డ్ సౌజన్యంతో..)*

---

*( 10వ పేజీ తరువాయి ..... )*

**ఆంధ్రప్రదేశ్ పరిస్థితి :-** సుప్రింకోర్టు మార్గదర్శకాలను అమలుచేయడానికి ఆంధ్రప్రదేశ్ చాలా అభ్యంతరాలు లేవనెత్తింది. వాటిలో ముఖ్యమైనవి.

1. రాష్ట్రసెక్యూరిటీ కమీషన్ ఏర్పాటువల్ల రాజ్యాంగపరంగా ఏర్పాటు కాబడిన రాష్ట్ర ప్రభుత్వాల పట్టు, రాష్ట్ర పోలీసుల మీద తగ్గి పోతుంది. ప్రజలకు జవాబు దారిగావుండని ఒక సమాంతర విభాగాన్ని ఏర్పాటు చేసినట్లవుతుందని DGPకి.
2. పదవీ విరమణతో నిమిత్తంలేకుండా 2సం॥ కాలపరిమితి విధించడం వల్ల అతని తరువాత వున్న సీనియర్ అధికార్లకు పదోన్నతి అవకాశాలు తగ్గిపోయి, వారా న్యూనతభావానికి గురౌతారు. ఈ మార్గదర్శకాలవల్ల ఒక అధికారిని వేరొక చోటికి మార్చే ప్రభుత్వ హక్కును కాలరాచినట్లవుతున్నదని,
3. మంచి పని తీరును తెలుసుకోడానికి నియమిత కాలపరిమితి ముఖ్యమేమీకాదని,
4. ఒక ప్రక్క జాతీయ మానవ హాక్కుల కమీషన్లు, రాష్ట్ర మానవ హక్కుల కమీషను, మైనారిటి కమీషను, రాష్ట్ర షెడ్యూల్డు కులాలు షెడ్యూల్డు తెగల కమీషను, సెంట్రల్ విజిలెన్స్ కమీషను, రాష్ట్ర విజిలెన్స్ కమీషను, లోకాయుక్త మొ॥ ఇప్పటికే పోలీసులపై ఫిర్యాదులను విచారిస్తున్నాయి. ఇన్నివుండగా రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయిల్లో కంప్లైంట్ అధారిటీని ఏర్పాటు చేయడమంటే పనిని డూప్లికేట్ చేయడమే కాక అవసరమైన ఆర్థిక భారం రాష్ట్రం మీద పడుతుందని.
5. కంప్లైంట్ అధారిటి వల్ల పోలీసు న్యూనతాభావానికి గురౌతారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో కంప్లైంట్ అధారిటి ఏర్పాటు చేయడంవల్ల పోలీసులు న్యూనతభావానికి, చట్టాన్ని సక్రమంగా అమలు చేయకపోతే శిక్షకు గురి చేయబడుతమేమో నన్న భయంతో నిర్వీర్యమై పోతరని.

పై విషయాలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒకరివ్యూపిటిషన్ దాఖలు చేసింది. ఆపిటిషన్‌ను ధర్మాసనం 23 ఆగస్టు 2007నాడు కొట్టివేసింది.

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఒక కొత్త పోలీసు చట్టం ముసాయిదాను తయారుచేసి ఈ అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని ప్రయత్నం చేస్తుంది. ప్రజాజీవితాలపై అమితంగా ప్రభావంచూపే ఈ బిల్లును ప్రజల ముందు చర్చకు పెట్టకుండానే ప్రభుత్వం నెగ్గించుకోవాలని ప్రయత్నంచేస్తుంది. ఒక మంచి పోలీసు వ్యవస్థ, ప్రజతోసంబంధం కలిగి, పనిచేసే విధంగా వుండాలంటే ముందుగా ఆ ముసాయిదాలను మేదావులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తల ముందు చర్చించి వారి విమర్శనాత్మక సలహాలను, సూచనలను తీసికొని లోటు పాట్లు తొలిగించి తేనే తప్ప ఒక మంచి పోలీసుచట్టం రూపొందిందని భావిస్తున్నాం. ●

# వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు బడ్జెట్ కేటాయింపుకై చేస్తున్న డిమాండ్లు

- రాష్ట్ర ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన వృత్తి దారులకు నిధులు కేటాయించాలని.
- చేతి వృత్తి దారులపై నిపుణుల కమిటి చేయాలని
- బిసిలకు రూ.12,500 కోట్ల బడ్జెట్ కేటాయించాలి.
- వృత్తి దారులు సంక్షేమం, అభివృద్ధి జనాభా ప్రాతి పదికన బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి.
- వృత్తి దారులు అభివృద్ధికి ఇచ్చిన జి.ఓ లు, చట్టాలను అమలు చేయాలి.
- ప్రతి కుటుంబానికి రెండున్నర ఎకరాల మణాణి, ఐదు ఎకరాల మెట్టచొప్పున భూమి, ఈనాం భూములకు పట్టాలు ఇవ్వాలి.
- ప్రతి వృత్తి దారుడికీ సబ్సిడీతో లక్షరూపాయలు ఆర్థిక సహాయం అందించాలి.
- వృద్ధులు, వితంతువులకు ప్రతి నెలా రూ. 500, వికలాంగులకు వెయ్యి రూపాయలు ఫించను ఇవ్వాలి.
- వృత్తి దారుల సమస్యలు తెలుసుకునేందుకు నిపుణుల కమిటి వేయాలి.
- ఇళ్ళ స్థలాలు, రేషన్‌కార్డులు, వర్క్‌షెడ్లు, కామన్‌షెడ్లు నిర్మించి ఇవ్వాలి.
- ముడి సరుకులను సబ్సిడీపై ఇవ్వాలి. పావలా వడ్డీకీ రుణాలు ఇవ్వాలి.
- క్రికెట్ కార్డులు, హెల్త్ కార్డులు అందజేయాలి. ఉచిత భీమా సౌకర్యం కల్పించాలి.
- వృత్తి కళాకారులను, వృత్తిలో వికలాంగులను గుర్తించి నిర్దిష్ట చర్యలు తీసుకోవాలి.
- సామాజిక దాడులు, సాంఘీక బహిష్కిరణలు, అత్యాచారాలు అరికట్టాలి. రక్షణ చట్టం తీసుకురావాలి.
- వృత్తుల్లోకి గుత్త పెట్టు బడిదారులు రాకుండా అడ్డుకోవాలి.
- ఒబిసి రిజర్వేషన్లు, కచ్చితంగా అమలు చేయాలి. అందరికీ స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలి.
- వృత్తి దారులు పిల్లలకు ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేయాలి.

***దేశంలోని ప్రజలందరికీ ప్రభుత్వాలు విధ్య, వైద్యాన్ని ఉచితంగా అందించాలనేది రాజ్యాంగ నియమమని, ఈ రెండు రంగాల కోసం బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి దానం అన్నారు.***

- ప్రతి పేద కుటుంబానికి సాగుభూమి ఇవ్వాలి.
- వారికి ఇంటిని, ఇళ్ల స్థలాన్నిఉచితంగా ఇవ్వాలి.
- అర్హత కలిగిన అందరికీ ఎప్పటికప్పుడు రేషన్‌కార్డులుఇవ్వాలి.
- కేంద్ర ప్రభుత్వం పెంచిన ఫించన్లను రాష్ట్రంలో అమలుజరపాలి.
- రేషన్‌కార్డున్న ప్రతికుటుంబానికీ ప్రభుత్వఆసుపత్రుల్లో ఉచిత వైద్యం మందులు ఇవ్వాలి.
- ఉపాధి హామీ పథకంలో అవసరమైన వారికిసంవత్సరానికి200 రోజులుపని కల్పించాలి.
- కౌలు రైతులకు కోనేరు రంగారావు కమిటి సిఫారులకు అనుగుణంగా గుర్తింపు కార్డులిచ్చి బ్యాంకు రుణాలు అందజేయాలి.
- సెజ్‌ల కోసం సాగుకు యోగ్యమైన భూములను తీసుకోవద్దని
- పెరుగుతున్న ధరల కనుగుణంగా కనీసవేతన చట్టాన్ని అమలుపరచాలనే ప్రధాన డిమాండ్లను పరిశీలించి వెంటనే పరిష్కరించాలి.

***సాధారణ విద్యకు 2006-07 లో 10.84 శాతంనిధుల కేటాయించగా 2007లో 9.62 శాతానికి కుదించారు. వైద్య రంగానికి 3.39 నుంచి 3.37 శాతానికి నిధులు తగ్గించారు.***

- జనాభాలో 18శాతం ఉన్న దళితులకు కేవలం 4శాతం నిధులను మాత్రమే ఖర్చు చేస్తున్నారు. గిరిజనులకు 7 నుంచి 8 శాతం ఖర్చు చేయాల్సి వుండగా కేవలం 2 నుంచి 3శాతం మాత్రమే ఖర్చు చేస్తున్నారు.

***ప్రణాళికా పద్దుల కింద 2007-08 బడ్జెట్‌ల వివిధ శాఖలకు రూ. 30,002 కోట్లను కేటాయిస్తే... ఇప్పటిదాకా, నమోదైన ఖర్చు కేవలం రూ. 12 వేల కోట్లే.***

- గ్రామీణ ప్రాంతాల్లో ఎస్సీలకు ఇళ్ళస్థలాల కొనుగోలు కోసం 2007-08 బడ్జెట్‌లో రూ. 200 కోట్లు కేటాయిస్తే... ఇప్పటి దాకా 16శాతం నిధులు మాత్రమే ఖర్చయ్యాయి.
- కేంద్ర ప్రభుత్వ మార్గ దర్శకాల ప్రకారం ఎస్సీలకు 16.8 శాతం ఎస్టీలకు 6.6శాతం సబ్‌ప్లాన్ కింద ఖర్చు చేయాలి.

***2006-7 అప్రాప్రి యేషన్ ఎక్కౌంట్స్ ప్రకారం ఈ సంవత్సరంలో మొత్తం ఖర్చు అంచనా రూ. 68350 కోట్లు కాగా వాస్తవంగా రూ. 57387 కోట్లు మాత్రమే. అంటే 10963 కోట్లు ఖర్చు చేయలేదు.***

- సంక్షేమ హాస్టళ్ళకు ప్రభుత్వం వచ్చే బడ్జెట్‌లో నిధులు పెంచాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

పై డిమాండ్లనన్నింటినీ ప్రభుత్వం ఏమేరకు పరగణనలోనికి తీసికొంటుందో తెలుసుకోవాలంటే ఫిబ్రవరి 16 వరకు ఓపిక పట్టాల్సి వుంటుంది.

**'సాక్షి'**

# దళితులపై జరిగిన అత్యాచార నేరాలు - అక్టోబర్ 2007 - జనవరి 2008

| వ. నెం. | స్థలము | నేరం | తేది / సంఘటన వివరాలు |
|---|---|---|---|
| 1. | గుంటూరు | అత్యాచారం | 19-10-07 సుబ్బాయమ్మ కడుపునొప్పితో బాధపడుతూ వైద్యం కొరకు డా॥ వెంకటేశ్వరరావు వద్దకు వెళ్ళింది. స్కానింగ్ చేయాలని గదిలోకి వెళ్ళిన పుడు డాక్టర్ తలుపులు వేసి అత్యాచారం చేశాడు. ఎవరికి చెప్పినా చంపేస్తానని బెదిరించారు. |
| 2. | గుంటూరు | అనుమానాద స్పద మృతి | 3-10-07 కనగాల. వెంకయ్య బాబు కేబుల్ ఆపరేటర్‌గా 8సం॥ల నుండి పని చేస్తున్నాడు. ఓనర్ ఆజ్ఞమేరకు కోటేశ్వరరావు బిల్లు చెల్లించనందుకు 11-10-07న కనెక్షన్ తీసివేశారు. ఓనర్ కానీ, పోలీసులు కాని తన కంప్లైంట్ గురించి పటించుకోలేదు. పైగా రాజీ ప్రయాత్నాలు చేశారు. వెంకయ్య బాబు అంగీకరించలేదు. 4-11-07 రాత్రి వెంకయ్యను చంపేశారు. |
| 3. | గుంటూరు | అత్యాచారం | 25-10-07 నలగొండ. పద్మ తన బంధువైన రామకృష్ణతో కలిసి పొలంలో గొర్రెలు కాయుచుండగాయాదవ కులస్తుడైన రాంబాబు ఆమెపై బలవంతంగా అత్యాచారం చేశాడు. తరువాత రాంబాబు తల్లి, సోదరి వచ్చి, పద్మను తిట్టి, కొట్టారు. పోలీసులు కేసురిజిష్టర్ చేశారు. |
| 4. | మహబూబ్‌నగర్ | కులదూషణ | 26-4-07 మాల. లక్ష్మమ్మను నాగయ్య అనే వ్యక్తి వివాహం చేసుకుంటానని నమ్మించి, 5సం॥ల నుండి వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. నాగయ్య వేరొకరిని వివాహం చేసుకోబోతున్నాడని తెలిసిన వెళ్ళి అడిగినందుకు, నాగయ్య, అతని తల్లి లక్ష్మమ్మను కొట్టి, కులంపేరుతో దూషించారు. లక్ష్మమ్మ కంప్లైంట్ ఇచ్చింది. |
| 5. | మహబూబ్‌నగర్ | సామూహిక అత్యాచారం హత్యాయత్నం | 14-09-07 మద్రాసు. మున్నెమ్మ తన కుమారునితో ఒంటరిగా ఉన్న సమయంలో రాత్రి 8గంటలకు రాములు, అతని తండ్రి బాలప్ప మరియు నారాయణ సామూహికంగా అత్యాచారం చేసి, ఆమెపై కిరోసిన్ పోసి, నిప్పంటించారు. బాధితురాలికి శరీరం కాలి గాయాలయ్యాయి. కేసు రిజిష్టర్ అయ్యింది. |
| 6. | విశాకపట్నం | కులదూషణ దాడి | లక్కవరంకు చెందిన 12 దళిత కుటుంబాలు సేధ్యం చేస్తున్న పంటను నిందితులు ధ్వంసం చేసి, వారి మీద దాడి చేసి, కులదూషణ చేసి, వారి వద్ద ఉన్న బంగారాన్ని దోచుకున్నారు. ఈ భూమి విషయంగా గతంలో కూడా గొడవులు కలవు. కేసు రిజిష్టర్ అయ్యింది. |
| 7. | విశాఖపట్నం | లైంగిక వేధింపులు | 6-12-07 పేరుపల్లి సంఘమిత్రి 10వ తరగతి విధ్యార్థినిని తన తరగతి ఉపాధ్యాయుడు పి. శివప్రసాద్ ప్రతి రోజూ బాధితురాలిని సంజ్ఞల ద్వారా, తన వికృత చేష్టలద్వారా వేధించడంతో కంప్లైంట్ ఇచ్చింది. రిజిష్టర్ అయ్యింది. |
| 8. | విశాఖపట్నం | పంచాయితీ మెంబర్‌పై దాడి, దూషణ | 22-6-07 దళిత పంచాయితీ వార్డ్ మెంబర్ పంచాయితీ మీటింగ్ బిసి వ్యక్తి హాల్లో నుండి బాధితుని బయటకు ఈడ్చి అంటరానివాడా మా అందరిలో కూర్చోనే అధికారం ఎవరు ఇచ్చారని ప్రశ్నించాడు. బాధితుడు కంప్లైట్ ఇచ్చినా, పోలీసులు చర్య తీసుకోకపోవడంతో కోర్టులో ప్రైవేట్ కంప్లైంట్ వేశాడు. కేస్ కోర్టులో పెండింగ్‌లో ఉంది. |
| 9. | నల్గొండ | బాలకార్మికు లుగా మార్చిన పాఠశాల యాజమాన్యం | 18-11-07 ఎస్సీ, ఎస్టీలు మరియు అనాథ బాలలకు చదువు నేర్పే క్రైస్తవ మిషనరీ పాఠశాలలో 70 మంది విద్యార్థులను పొలంలో ప్రత్తి తీయుటకు తీసుకెళ్ళారు. |
| 10. | నల్గొండ | దళితుల గిరిజనుల కనీసవేతనాల దోపిడి | చందంపేటలోని దళితులు ఉపాధి హామీ పథకం ద్వారా బోడ.రాములు అనే వ్యక్తి ద్వారా 56 రోజులు పని చేశారు. దానికి గాను రూ.4058/- చెల్లించియున్నారు. మిగిలిన రూ. 4000/- గురించి అడిగినపుడు ఖర్చులకు అయ్యాయని తెలిపారు. నరేట్‌కొమ్మకు చెందిన బణావత్. చక్రి 3 నెలల పని చేసింది. ఆమెకు వేతనాలు ఏమీ ఇవ్వలేదు. కానీ, సోషల్ ఆడిట్‌లో ఒక్కొక్కరి పేరు మీద రూ. 3,220/- డ్రా చేసినట్లు అధికారులకు తెలిసింది. |

| | | | |
|---|---|---|---|
| 11. | నల్గొండ | కులదూషణ | 15-9-07 గడ్డ సోమయ్య. అనే దళితుడిని, రెడ్డి కులానికి చెందిన 4 గురు కులం పేరుతో దూషించారు. |
| 12. | రంగారెడ్డి | | 21-10-07 రాత్రి 11గం॥ లసమయంలో మాదిగ కులస్తుడైన అంజయ్యాపై బిసీకి చెందిన 7గురు దాడి చేశారు. మరల 22-10-07 ఉదయం 6గం॥లకు బిసీ కులస్తులు 100 మంది మాదిగలపై దాడి చేసి, కులం పేరుతో దూషించి, దుర్భాషలాడి, చంపుతామని బెదిరించారు. దళితులకు ప్రభుత్వం ద్వారా వచ్చిన పక్కా గృహలను నిందితులు స్వాధీనం చేసుకొని, ఆవిషయాన్ని ప్రశ్నించినందు గాను దాడి చేశారు. |
| 13. | కడప | మైనర్ బాలిక పై అత్యాచారం | ఇంటిలో ఉన్న దళిత బాలికను నిందితుడు తన స్నేహితుని ఇంటికి తీసుకువెళ్ళి అత్యాచారం చేశారు. పోలీసులు కేసు రిజిస్టర్ చేశారు. |
| 14. | నల్గొండ | అత్యాచారం | 14-12-07 వివాహిత, ముగ్గురు పిల్లలకు తల్లియైన మహిళను బలాత్కరించి అత్యాచారం చేసినందున, రక్తస్రావమై స్పృహకోల్పోయింది. నల్గొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గతంలో బాధితురాలికి మూడుసార్లు ఆపరేషన్ చేశారు. |
| 15. | మహబూబ్‌నగర్ | లైంగిక వేధింపులు | సర్వే అండ లాండ్ రికార్డ్ ఆఫీసులో అటెండర్‌గా పని చేస్తున్న బాధితురాలిని అదే ఆఫీసులో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ లైంగిక వేధింపులకు గురి చేశాడు. కేసు రిజిస్టర్ చేశారు. |
| 16. | చిత్తూరు | ఆత్మహత్య | 5-11-07మొగులప్ప (55) తన ఇంటి నకళ్ళు ఇవ్వవలసిందిగా తహిసిల్దార్‌ను ఎన్నో సార్లు విన్నవించుకున్నప్పటకీ, తహిసిల్దార్ నాగమణి బాధితుని నిందించి, బెదిరించినది. అవమానం భరించలేక బాధితుడు ఆత్మహత్య చేసుకున్నాడు. |
| 17. | మహబూబ్‌నగర్ | అనుమానా స్పద స్థితి | 14-11-07 బాధితుడు తన స్వగ్రామములోని హోటల్‌లో టీ తాగుచుండగా నిందితుడు బాధితుని నెట్టి, ఎంతధైర్యంరా మాతోకలిసి టీ తాగడానికి అంటూ రాళ్ళలో పడేసి కౄరంగా కొట్టారు. బాధితుడు తీవ్ర గాయాలలో, రక్తస్రావంతో మహబూబ్‌నగర్ హాస్టల్‌లో మూడు రోజులు వైద్యం చేయించుకున్నప్పటికి కోలుకోలేదు. ఆగాయాలతోనే 10-12-07న మరిణించాడు. |
| 18. | గుంటూరు | లైంగిక వేధింపులు | 30-11-07 పులి.వేణు విద్యార్థిని ప్రధానాపాధ్యాయుడు తన వికృత చేష్టలతో వేధించడంతో మనస్తాపం చెందిన బాధితుడు విషం త్రాగాడు. అతని తండ్రి హాస్పటల్‌లో చేర్పించారు. |
| 19. | విశాఖపట్టణం | దాడి | 8-1-08 వెలుగు ప్రాజెక్టులో పని చేస్తున్న రాములమ్మ తలనొప్పితో బాధపడుతూ పనిలోకి రాలేదని సూపర్‌వైజర్ ఆమెపై దాడి చేశారు. బాధితురాలు దెబ్బలకు స్పృహతప్పి పడి పోయింది. కంప్లైంట్ ఇస్తే ఎటువంటి చర్య తీసుకోలేదు. బాధితురాలిని హాస్పటల్‌లో చేర్చారు. |
| 20. | మహబూబ్‌నగర్ | హత్యాయత్నం | 9-12-07 వంట చెఱకు తెచ్చుకోవడానికి వెళ్ళిన బాధితురాలిని 4గురు అగంతకులు కత్తి చూపి బెదిరించి, ఆమెను ఒక చట్టుకు ఉరివేశారు. ఆమె కోసం వెదుకుతున్న తల్లిదండ్రులు ఆమెను కనుగొని బాధితురాలిని క్రిందికి దించి, హాస్పటల్‌లో చేరారు. |
| 21. | మహబూబ్‌నగర్ | కులదూషణ | మాదిగ కులానికి చెందిన 4గురు అంజనేయగుడికి దగ్గరలో ఉన్న చెట్టు క్రింద కూర్చుని యుండగా, వీరన్నగౌడ్ వచ్చి, తెల్లని బట్టలు వేసుకొని, గుడి దగ్గర భూస్వాముల్లాగా కూర్చున్నారేంటిరా అని దుర్భాషలాడాడు. ప్రశ్నించిన రామ చంద్రయ్యను కాలర్ పట్టి నెట్టాడు. కేసు రిజిస్టర్ చేశారు. |
| 22. | నల్గొండ | అనుమానా స్పద మృతి | 25-12-07 పొడిచేటి లక్ష్మమ్మ భర్త, సూరయ్యను హత్యచేసి, ఆత్మహత్యగా చిత్రీకరించారని కేసు రిజిష్టర్ అయ్యింది. |
| 23. | రంగారెడ్డి | హత్య | 7-12-07 డప్పు. ఎల్లేష్ అనే మాదిగ వికలాంగునకి, ముగ్గురు నిందితులకు మధ్య సెల్‌ఫోన్ గురించి గొడవ ప్రారంభమై, బాధితుడు మరియు నిందితుల. మధ్యం సేవించి బాధితుని హత్య చేశారు. |
| 24. | రంగారెడ్డి | హత్య | బిచ్చమ్మ తన తమ్ముడిని చంపిన నిందితులపై కేసు పెట్టినందుకు, వారు బాధితురాలిని కూడా హత్య చేశారు. |
| 25. | వరంగల్ | జోగినిగా మార్చటం | రేణుకను జోగినిగా మార్చిన సంఘటన. |
| 26. | గుంటూరు | బాంబులతో దాడి | 24-1-08 బాంబు దాడులలో ఇద్దరు మరణించారు. |

| | | | |
|---|---|---|---|
| 27. | చిత్తూరు | దాడి | 18-6-07 గ్రామ పంచాయితీలోని కరువుపనులు చేసిన తాలూకు బిల్లులు బినామీ పేర్లతో డ్రా చేశారని నిందితులను అడిగినందుకు భాదితులను కులదూషం, మరియు దుర్భాషలాడి, వారిని కట్టెలు, నీటిపైపులతో కొట్టి గాయపరిచారు. |
| 28. | మెదక్ | సామూహిక అత్యాచారం | 1-0-08 సుగుణ తన భర్తతో కలిసి రాత్రి సమయంలో హాస్పటల్ నుండి వస్తుండుగా 15మంది అగంతకులు భర్తను కొట్టి, ఆమెను సామూహికంగా అత్యాచారం చేశారు. |
| 29. | హైదరాబాద్ | అత్యాచార యత్నం | సెంట్రల్ యూనివర్శిటీలో ముగ్గురు విద్యార్థునులపై గుర్తు తెలియని అగంతకులు అత్యాచార యత్నానికి పాల్పడినారు. |
| 30. | ఖమ్మం | అత్యాచారం | 04-01-08 శనక్కాయలు ఆశ చూపి ఇంట్లోకి తీసుకుని వెళ్ళి మైనర్ బాలికపై అత్యాచారం. |
| 31. | హైదరాబాద్ | బాలకార్మిక వ్యవస్థ | 04-01-08 అంజలి అనే పది సం॥ల బాలికతో ఇంటి పనులు చేయిస్తూ నిందితులు వేధించారు. బాలిక టి.వి చానల్ వారిని ఆశ్రయించింది. |
| 32. | హైదరాబాద్ | బాలకార్మిక వ్యవస్థ | 04-01-08 యండి షకీల్(13) అమర పేపర్ మిల్‌లో పని చేస్తున్నాడు. మెషిన్‌లో ముడి సరుకు నింపుతూ మెషిన్‌లో పడి, మరణించారు. |
| 33. | హైదరాబాద్ | అత్యాచార యత్నం | 08-1-08 చెరుకుతోటలో పనిచేస్తున్న ఒక దళిత మహిళపై హబీబ్ అనే వ్యక్తి అత్యాచార యత్నం చేశాడు. |
| 34. | మెదక్ | లైంగిక వేధింపులు | 08-01--08 విద్యార్థినిపై ప్రధానోపాధ్యాయుడి వేధింపులు |
| 35. | కృష్ణా | సామూహిక దాడి | 11-1-08 సాంఘిక సంక్షేమ వసతి గృహంలోనికి అగంతకులు వచ్చి, వాచ్ ఉమెన్ మరియు విద్యార్థినిపై దాడిచేసారు. |
| 36. | హైదరాబాద్ | కిడ్నాప్ & సామూహిక అత్యాచారం | 14-1-08 నిందితులు రంజిత (14) ను గదిలో బంధించి అత్యాచారం చేశారు. |
| 37. | విశాఖపట్నం | సామూహిక అత్యాచారం | 13-1-08 కృష్ణ అనే వ్యక్తి బాధితురాలిపై వరుసగా 4 రోజులు అత్యాచారం చేసి, తరువాత తన స్నేహితుల వద్ద వదిలాడు. వారు ఆమెను బెదిరించి అత్యాచారం చేశారు. |
| 38. | మెదక్ | యాసిడ్‌తో దాడి | 31-1-08 ప్రమీల అనే మహిళ మీద చంద్రయ్య అనూ వ్యక్తి యాసిడ్‌తో దాడిచేశాడు. నిందితుడు బాణామతి చేస్తూ ఉంటాడు. |
| 39. | హైదరాబాద్ | కిడ్నాప్ & సామూహిక అత్యాచారం | 21-1-08 25సం॥రాల మహిళను 4గురు అగంతకులు కిడ్నాప్ చేసి, అత్యాచారం చేశారు. |
| 40. | కరీంనగర్ | కిడ్నాప్ & సామూహిక అత్యాచారం | 21-1-08 దుర్గ (29) మూగ మహిళను అగంతకులు కిడ్నాప్‌చేసి, దారుణంగా అత్యాచారం చేశారు. |
| 41. | విశాఖపట్నం | సామూహిక అత్యాచారం | 21-1-08 రామకృష్ణ అనే జీపు డ్రైవర్ తన స్నేహితులతో 18 సం॥రాల యువతిని తీసుకొచ్చి ఉడా పార్కు వద్ద అత్యాచారం చేశారు. |
| 42. | హైదరాబాద్ | కిడ్నాప్ & సామూహిక అత్యాచారం | 22-1-08 5గురు అగంతకులు 14సం॥రాల మైనర్ బాలికను కిడ్నాప్‌చేసి, అత్యాచారం చేశారు. |
| 43. | శ్రీకాకుళం | కులదూషణ & దాడి | 21-1-08 అప్పలస్వామి, భాస్కరరావు, తులసిదాసు అనేవారు భారతిని మరియు ఆమె తండ్రిని కులంపేరుతో దూషించి, దాడిచేశారు. |
| 44. | గుంటూరు | ఉద్యోగుల పై వేధింపులు | 17-1-08 స్పిన్నింగ్ టెక్స్‌టైల్స్ కంపెనీ అధికారులు ఉద్యోగులపై వేధింపులు |



# బాబా సాహెబ్ డా॥ అంబేడ్కర్ మాట

మనువు ప్రస్తావనలను బట్టి చూస్తే హిందూ సామాజిక వ్యవస్థ బాహాటంగా, స్పష్టంగా అగ్రవర్ణాల కోసమేనన్న విషయం స్పష్టం. ప్రతిదీ వారి కోసమే సృష్టించబడింది. అగ్రవర్ణాలకి హక్కులే కాని విధులు లేవు. అన్నీ వాళ్ళ చెప్పుచేతల్లోనే వుంటాయి. ప్రతిదీ వారి బాగును దృష్టిలో పెట్టుకొనే చేయాలి. మరోకోణంలో సామాన్యవ్యక్తికి పతనం కన్పిస్తుంది. అగ్రవర్ణాలతో పోలిస్తే దళితులకి ప్రాణం, స్వేచ్ఛ, ఆస్తి సుఖసౌభాగ్యాలకు సంబంధించిన హక్కులు లేవు.

## చెప్పులు

ఆచార్య కొలకలూరి ఇనాక్

కొత్తలో తప్ప
అరవ్వు కరువ్వు

అరిస్తే, నీళ్ళు పోస్తే
నోరు బంద్ !

కరిస్తే, గూటంతో వేస్తే
కుక్కిన పేను

మెదిలితే మొత్తు
కదిలితే ఒట్టు

అవి గుళ్ళోకి రావు
బళ్ళోకి పోవు

వాటికి, కూడు లేదు
గూడు లేదు

అవి, వాకిట్లో కుక్కలు
వీధిలో కాకులు

ఎండ కారం తిని
వాన గంజి తాగి
కాళ్ళకింద సదా చెప్పులు

అవి తమను తన్నాయని
కసిగా పీకి పెడుతున్నాయి
ఊరకుక్కలు

చరిత్ర, చెప్పులతో
చెంపలు వాయిస్తే
బిత్తర పోయి
నిద్దర పోయింది జాతి

ఉన్నచోట ఉండని నీ
ఉన్న కాణ్ణుంచి కదలని నీ
చెప్పులు
దేవుళ్ళ తప్పులు.


మీ అభిప్రాయాలను కింది చిరునామాకు పంపండి.

సాక్షి హ్యూమన్ రైట్స్ వాచ్, ఎ.పి.

ఇం.నెం. 10-3-129, IInd ఫ్లోర్, టీచర్స్ కాలనీ, లేన్ నెం. 4, స్ట్రీట్ నెం. 3, ఈస్ట్ మారేడుపల్లి, సికింద్రాబాద్ - 500 026.
ఫోన్ : 040 - 65440969 ఫ్యాక్స్ : 040 - 27737086
ఇ-మెయిల్ : Sakshi_ap@satyam.net.in వెబ్‌సైట్ : www.sakshiap.org



Published by **V. Nanda Gopal,** Director, Sakshi Human Rights Watch, A.P. Secunderabad - 500 026.